Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 265 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)


గురువారం, 4 - 6 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# ప్రతిష్టాత్మకంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

**- జిల్లాకో ప్రత్యేక థీమ్... టూరిజం ప్రాంతాల వేదికగా యోగా డే - జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు-యోగా నెలగా జూన్ - పవన్ కళ్యాణ్ పై తెలంగాణ నేతల వ్యాఖ్యలు సరి కావు - తమిళనాడుతో నాతో సహా వివిధ రాష్ట్రాల నేతలు ప్రచారం చేయలేదా..? - ఏ ప్రాంతానికి ఎవరేం చేశారో ప్రజలకు తెలుసు - డీఎస్సీ నిర్వహణ అనేది టీడీపీ బ్రాండ్ - మంచి పనులపై బురద జల్లడమే కొందరు పనిగా పెట్టుకున్నారు - మీడియా కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు**







**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రతిష్టాత్మకంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. కోటి మందితో ఈ నెల 21వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా యోగా డే నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర-2026 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. యోగాంధ్ర-2026 కార్యక్రమం నిర్వహణపై సీఎం చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోయే కార్యక్రమాలను ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో వివరించారు. అలాగే ఇటీవల జరుగుతున్న పరిణామాల పైనా మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా. జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలు, అనారోగ్య సమస్యలకు యోగా బెస్ట్ మెడిసిన్. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక వికాసాన్ని అందించే సమగ్ర ఆరోగ్య సాధన యోగా. యోగాను మన జీవన విధానంలో భాగం చేసేందుకు యోగాంధ్ర ద్వారా ప్రయత్నిస్తున్నాం. ఈ ఏడాది కూడా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'యోగాంధ్ర-2026' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా కోటి మందిని భాగస్వామ్యం చేయడమే లక్ష్యం. ఈ ఏడాది 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్ Yoga for Healthy Aging. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించేందుకు యోగాను అనుసరించాలని చెప్పడమే థీమ్ ఉద్దేశం. ఇది ఒక్కరోజు కార్యక్రమం కాదు. ప్రతి ఇంట్లో, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి యోగా ఒక శక్తివంతమైన ఉద్యమంగా మారాలి. ఈసారి యోగాంధ్ర 2026ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. గతేడాది స్ఫూర్తిని కొనసాగించాలి. జూన్ 7 నుంచి 20 వరకు 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తాం. అమరావతిలో జరిగే ప్రధాన కార్యక్రమంలో కృష్ణానది వెస్ట్ బైపాస్ వంతెనపై 25 వేల మందితో యోగా ప్రదర్శన నిర్వహిస్తాం. ప్రతి జిల్లాకు ప్రత్యేక థీమ్ నిర్ణయించాం. ఎన్టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో కార్యక్రమాలు నిర్వహిస్తాం. ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మంది పాల్గొనే కార్యక్రమాలు నిర్వహిస్తాం. రాష్ట్రంలోని 56 ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించి యోగా-టూరిజాన్ని ప్రోత్సహిస్తాం. ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి చారిత్రక ప్రాంతాలు వేదికలుగా ఈ యోగా కార్యక్రమం చేపడుతున్నాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**విద్యాభ్యాసంతో పాటు యోగాభ్యాసానికి ప్రాధాన్యత**

"యువతలో, మహిళల్లో, విద్యార్థుల్లో యోగా పట్ల ఆసక్తి పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాం. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా యోగాను ప్రజారోగ్య ఉద్యమంగా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు చేస్తాం. ప్రస్తుతం ఉన్న ట్రైనర్ల సంఖ్యను 2.50 లక్షలకు పెంచేందుకు కార్యాచరణ చేపట్టాం. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాం. జిల్లా స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రచారం, నిర్వహణ ఏర్పాట్లకు ఈ నిధులు వినియోగిస్తాం. అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశాం. యోగాను ఒక్కరోజు కార్యక్రమంగా పరిమితం చేయకుండా 365 రోజుల ఉద్యమంగా కొనసాగిస్తాం. రాష్ట్రంలో ఒక కోటి మంది క్రమం తప్పకుండా యోగా చేసేలా చర్యలు తీసుకుంటాం. ఏపీ యోగా ప్రచార పరిషత్, సంజీవని యాప్, హ్యాబిల్డ్ వాట్సాప్ కమ్యూనిటీల ద్వారా నిరంతర శిక్షణ చేపడుతున్నాం. జూన్ నెల మొత్తాన్ని 'యోగా నెల'గా ప్రకటించాం. దీనిని సక్సెస్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సాయం తీసుకుంటున్నాం. ప్రతి ఇంటికి యోగా చేరేలా మంతెన సత్యనారాయణ రాజు ప్రత్యేక



వీడియోలు రూపొందించారు. సాధారణ యోగా ఆసనాలు, వ్యాధి నివారణ, రోజువారీ సాధన, యోగా సందేహాలకు సమాధానాలు వంటి అంశాలపై 168కు పైగా వీడియోలు అందుబాటులో ఉన్నాయి. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్లు ఉచితంగా ప్రజలకు చేరువ చేయాలి. వాట్సాప్ నంబర్ 81424 04888కు 'Hi' అని మెసేజ్ పంపిస్తే యోగా వీడియోలు వస్తాయి. స్కూళ్లు, కాలేజీల్లో యోగాను చదువులో భాగం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేయగలిగితే ఆరోగ్యవంతమైన తరాన్ని తీర్చిదిద్దగలం. యోగాంధ్ర-2026 కోసం యోగాంధ్ర పోర్టల్‌ను ప్రారంభించాం. yogandhra.ap.gov.in ద్వారా కార్యక్రమాల వివరాలు, వీడియోలు, నమోదు ప్రక్రియ తదితర సమాచారం అందుబాటులో ఉంటుంది.

(మిగతా 2వ పేజీలో)


# టూరిజం హబ్‌గా పోలవరం ప్రాజెక్ట్

**- స్పిల్ వేకు దిగువన బ్రిడ్జి నిర్మాణానికి షెడ్యూల్ - ఏలూరు, కొవ్వూరు, రాజమండ్రిలకు కలుపుతూ హైవే కనెక్టివిటీ - గోదావరి పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాలి - అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, డిజైనర్స్‌తో సమీక్ష : జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

**అమరావతి, (రాజధాని వార్తలు):** 2027లో వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును టూరిజం హబ్‌గా రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించా



రని తెలిపారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. అందుకు తగ్గట్లే లేఅవుట్ ప్లాన్ డిజైన్ తయారు చేసేందుకు 9,900 ఎకరాల విస్తీర్ణంతో లైడార్ సర్వే కూడా పూర్తి చేశామని స్పష్టం చేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి నిమ్మల పోలవరం ప్రాజెక్టును ఏలూరు, కొవ్వూరు, రాజమండ్రిలకు జాతీయ రహదారులతో అనుసంధానించేలా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. స్పెల్ వేకి దిగువన బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించి డిజైన్స్ అనుమతులు, ఇతర పనుల కోసం షెడ్యూల్ ఇవ్వాలని, ఆ షెడ్యూల్‌కు అనుగుణంగా కాలయాపన లేకుండా పనులు చేయాలని అధికారులను, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్ట్ లో కీలకమైన ఈసిఆర్ఎఫ్ డ్యాం పనులు గ్యాప్-1 లో 45 శాతం, గ్యాప్-2 లో 22 శాతం పూర్తయ్యాయి అని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు ఈ ఏడాది ఆగష్టు నాటికి పూర్తి చేసి, అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్తాం అని అన్నారు. ఇంక కుడి, ఎడమ ప్రధాన కాలువల టన్నెల్స్ కనెక్టివిటీల పనులు 90 శాతం పూర్తయ్యాయి తెలిపారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశి భూషణ్ కుమార్, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, పోలవరం ప్రాజెక్టు ఎస్ఈ రామచంద్ర రావు, మేఘా ఇంజనీరింగ్ సంస్థ జాయింట్ సివోవో అంగర సతీష్ బాబు, డిజిఎం మురళీ, మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.






# ప్రతిష్టాత్మకంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

మహిళలు, విద్యార్థుల్లో యోగాపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని సంజీవని ప్రాజెక్టుకు కూడా లింక్ చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఇషా ఫౌండేషన్ సద్గురు జగ్గీ వాసుదేవ్, బ్రహ్మకుమారీస్, దాజీ, బాబా రామ్ దేవ్‌లాంటి విశిష్ట వ్యక్తుల భాగస్వామ్యం తీసుకుంటున్నాం. ప్రకృతి ఆశ్రమం నిర్వహిస్తున్న మంతెన సత్యనారాయణ రాజు సేవలు కూడా వినియోగించుకుని యోగాను ఇంటిగ్రేట్ చేస్తాం. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ఈ యోగా విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణ చేపడుతున్నాం. గత ఏడాది యోగాంధ్ర కార్యక్రమంతో దేశం, ప్రపంచం మొత్తం మన వైపు చూసేలా చేశాం. విశాఖలో ప్రధాని మోదీ సమక్షంలో నిర్వహించిన యోగాంధ్రతో రికార్డులు సృష్టించాం. గతేడాది 2.44 కోట్ల మంది యోగాంధ్ర కార్యక్రమానికి పేర్లు నమోదు చేసుకున్నారు. 1.91 కోట్ల మందికి సర్టిఫికెట్లు అందించాం. 1.33 లక్షల వేదికలపై 1.53 లక్షల మంది ట్రైనర్లతో నిర్వహించాం. 2.18 కోట్ల మంది వెల్‌నెస్ సెంటర్లు, ఆయుష్ కేంద్రాల ద్వారా క్రమం తప్పకుండా యోగా చేస్తున్నారు. రెండు రాష్ట్రాల్లోని తెలుగు వారు ఉపయోగించుకునేలా యోగాంధ్ర పోర్టల్ ఏర్పాటు చేస్తున్నాం. నాణ్యమైన జీవనానికి యోగా మనకు వారసత్వంగా అందిన ఓ అమూల్యమైన సంపద... దానిని అంతా అందిపుచ్చుకోవాలి. ఏపీలో చేస్తున్న ప్రకృతి సేద్యానికి అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చింది... ఈ విజ్ఞానాన్ని మనం ప్రపంచానికి అందించేలా చర్యలు చేపడుతున్నాం."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం ఇప్పుడు సాధ్యం కాదు**


"తెలంగాణలో పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు సరికాదు. ఇలాంటివి మాట్లాడి లేనిపోని సమస్యలు సృష్టించకూడదు. విభజన జరిగి 12 ఏళ్లు అయ్యింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయాం. తెలంగాణలోని కొందరు నాయకులు ఇప్పుడు మాట్లాడి విద్వేషాలు రెచ్చగొట్టలేరు. ఏ ప్రాంతానికి ఎవరేం చేశారో ప్రజలకు తెలుసు. తెలంగాణలోని కొందరు నాయకులు అనవసర అంశాలు మాట్లాడుతున్నారు. నేను తమిళనాడులో ఎన్నికల ప్రచారం చేశాను. తమిళనాడుకు కర్నాటకతో సహా వివిధ ప్రాంతాలకు చెందిన వారు... జాతీయ స్థాయి నేతలు వచ్చారు. కర్నాటక నుంచి డీకే శివకుమార్ కూడా వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్ ఉంది. బీఆర్ఎస్ నేషనల్ పార్టీ అని ఆంధ్రప్రదేశ్ లో కూడా ఆ పార్టీ శాఖను పెట్టారు. విస్తరిస్తాం అన్నారు. మరి ఇప్పుడు ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. ఇది కరెక్ట్ కాదు. అమెరికాలో, ఆస్ట్రేలియాలో, యూకేలో తెలుగువాళ్లు రాజ్యాంగ పదవుల్లో ఉన్నారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో మన వాళ్లు పదవులు చేపడుతున్నారు. అక్కడ ఉండే రాజ్యాంగం ప్రకారం పని చేస్తున్నారు. ప్రజలకు ఎవరు మంచిగా సేవలందిస్తారో... వాళ్లు ఆయా ప్రాంతాల్లో నాయకులు అవుతున్నారు. అభివృద్ధిలో, ప్రజా సేవలో పోటీ పడాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి. ప్రజలకు మంచి చేయటంలో పోటీ పడాలి తప్ప... ప్రజల మధ్య విబేధాలు తేవటం సరికాదు. రెండు ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరగాలి. అనసవరంగా వివాదాలు సృష్టించటం ఎవరికీ మంచిది కాదు."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**బాగు చేస్తుంటే బురద జల్లుతారు... ఇదీ గొడ్డలి పార్టీ నైజం**

"గొడ్డలి పార్టీకి విమర్శలు, విధ్వంసం తప్ప ఏమీ చేతకాదు. ఆరోగ్యకరమైన రాజకీయాలు చేయలేని వారిని ప్రజలు బహిష్కరించాలి. అసత్యాన్ని పదేపదే చెబితే ప్రజలు విశ్వసిస్తారని కొందరు అనుకుంటున్నారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాల నియామకానికి టీడీపీఓ బ్రాండ్. ఎన్నికల్లో ప్రకటించి అధికారంలోకి రాగానే మొదటి సంతకం చేసి అత్యంత కట్టుదిట్టంగా నియామకాలు చేపట్టాం. స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు అంటున్నారు. కానీ వారికి క్రీడల్లో ఏమేమి ఉన్నాయో కూడా తెలీకుండా మాట్లాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కేటగిరీల ఆధారంగా స్పోర్ట్స్ కోటాలో నియామకాలు జరిగాయి. వాళ్ల పేటిఎం బ్యాచ్‌ల ద్వారా లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారు. కొందరు చేస్తున్న దద్దమ్మ పనులకు ప్రజలు ఇబ్బందులు పడాలా...? పారదర్శకంగా చేసిన నియామకాలపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారు. బాధ్యత కలిగిన రాజకీయ పార్టీగా అధ్యయనం చేసి ఆ తర్వాతే మాట్లాడాలి. సాక్ష్యాలు, నిజాలతో అసెంబ్లీలో గట్టిగా పోరాడిన ఘటనలు ఉన్నాయి. కొందరు ఏదేదో మాట్లాడేసి బురద చల్లుతామంటే ఎవరు విశ్వసిస్తారు..? యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణ కోసం రూ.10 కోట్లు బడ్జెట్ కేటాయించాం. దీనిపైనా విమర్శలు చేయటం ఏమిటి..? ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి పనిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. దీనికి ప్రజల్లో చైతన్యం తీసుకు రావటం తప్ప మరోమార్గం లేదు."అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

# ఏపీ మెడికల్ కౌన్సెల్ ఛైర్మన్‌గా డాక్టర్ గార్లపాటి నందకిషోర్, వైస్ ఛైర్మన్‌గా కె.వెంకట సుబ్బానాయుడు





**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఏపీ మెడికల్ కౌన్సెల్ ఛైర్మన్ గా డాక్టర్ గార్లపాటి నందకిషోర్ (ఈఎన్టీ-గుంటూరు), వైస్-ఛైర్మన్ గా కె.వెంకట సుబ్బానాయుడు (ఫల్మనాలజీ-ఒంగోలు) ఎన్నికయ్యారు. విజయవాడలోని కౌన్సెల్ కార్యాలయంలో బుధవారం నాడు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరిగింది. మెడికల్ కౌన్సెల్‌లో సభ్యత్వం కలిగిన వైద్యులు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకున్న 13 మంది, అంతకు ముందు కూటమి ప్రభుత్వం నామినేట్ చేసిన ఎనిమిది మంది, ఎక్స్ అఫిషియో సభ్యులు (అధికారులు) నలుగురు ఓటింగ్ (మొత్తం 25)లో పాల్గొన్నారు. ఇందులో 16 - 9 ఓట్ల తేడాతో ఛైర్మన్‌గా నందకిషోర్, అలాగే 14 - 10 ఓట్ల తేడాతో వైస్- ఛైర్మన్‌గా సుబ్బానాయుడు గెలిచారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కెవియన్.చక్రధర్ బాబు వెల్లడించారు.

**ముగ్గురు కార్య నిర్వాహక సభ్యుల ఎన్నిక**

నూతన ఛైర్మన్ నేతృత్వంలో ముగ్గురు కార్యనిర్వాహక సభ్యుల ఎన్నిక జరిగింది. మెడికల్ కౌన్సిల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ శ్రీహరి రావు, డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి, డాక్టర్ స్వర్ణ గీత 14-9 ఓట్ల తేడా (ఒక్కొక్కరు)తో గెలుపొందారని నూతన ఛైర్మన్ డాక్టర్ నశీదకిషోర్ తెలిపారు. నూతన ఛైర్మన్ పదవీ కాలం రెండేళ్లు. వైస్ ఛైర్మన్, కార్యనిర్వాహక సభ్యులు ఏడాదికి ఒకసారి మారతారు. కౌన్సిల్ పదవీ కాలం ఐదేళ్లు. 2006 తర్వాత తొలిసారిగా కౌన్సెల్‌కు చివరిగా ఎన్నికలు 2006లో జరిగాయి. అ తరువాత కూటమి ప్రభుత్వం హయాంలో ఎన్నికలు ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగాయి. 2006 తరువాత ఎన్నికలు జరగనశీదున కౌన్సెల్ సభ్యుల నియామకాలు జరుగుతూ వచ్చాయ. ఇదే క్రమంలో కిందటి ఏడాది నామినేట్ విధానంలో ఎంపిక చేసిన సభ్యులు కలిసి ఎన్నుకున్న ఛైర్మన్, వైస్-ఛైర్మన్ డి.శ్రీహరిబాబు, జి. సుజాతల పదవీకాలం గత ఫిబ్రవరిలో ముగిసింది.

**వైద్య రంగంలో ఉత్తమ ప్రమాణాల పెంపునకు కృషి**

**గార్లపాటి నందకిషోర్, సుబ్బానాయుడు**

వైద్య రంగంలో ఉత్తమ ప్రమాణాల పెంపునకు కృషి చేస్తామని నూతన ఛైర్మన్ నందకిషోర్, వైస్ ఛైర్మన్ డాక్టర్ కె.వెంకట సుబ్బానాయుడు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మార్గదర్శకత్వంలో కౌన్సెల్ తరపున బాధ్యతలు సమర్ధంగా నిర్వర్తిస్తామని చెప్పారు. సహచర సభ్యుల భాగస్వామ్యంతో ముందుకు సాగుతామని తెలిపారు.

**15 ఏళ్ల నుంచి ఐఎంఏ తరపున కీలక బాధ్యతలు నిర్వర్తించిన నందకిషోర్**

నూతన ఛైర్మన్ నందకిషోర్ రాష్ట్ర ఇండియన్ మెడికల్ అసోసియేషన్లో వివిధ హోదాల్లో 2012 నుంచి 15 ఏళ్లపాటు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తొలుత 2012-2014లో గుంటూరు ఐఎంఏ కార్యదర్శిగా వ్యవహరించారు. ఐఎంఏ తరపునే రాష్ట్ర జాయింటు సెక్రటరీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఫామిలీ బెనిఫిట్లు స్కీమ్ సెక్రటరీ, గుంటూరు అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి, ఐఎంఏ జాతీయ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, సెంట్రల్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు. నేషనల్ ఐఎంఏ తరపున బెస్ట్ స్టేట్ సెక్రటరీ, బెస్ట్ స్టేట్ అధ్యక్షునిగా అవార్డులు పొందారు. విజయవాడలోని సిద్ధార్ధ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి! విజయవాడలోని సిద్దార్ధ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన నందకిషోర్ విశాఖపట్టణం ఆంధ్ర మెడికల్ కాలేజీల్లో ఎంఎస్ పూర్తి చేశారు. కాటూరి మెడికల్ కాలేజీలో కన్సల్టెంటు జుచీ సర్జన్, హెడ్ ఆఫ్ డిపార్టుమెంటు అండ్ అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేశారు. రాష్ట్ర ఈఎన్టీ వైద్యుల సంఘానికి కార్యదర్శిగా, కోశాధికారిగా వ్యవహరించిన నందకిషోర్ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఫైర్ ఎన్వోసీల జారీ విధాన ప్రక్రియల్లో పాల్గొన్నారు. నందకిషోర్ కు టీచింగ్ రంగంలో తొమ్మిదేళ్ల అనుభవం ఉంది. శ్రీ వెంకటే శ్వర మెడికల్ కాలేజీలలో ఎంబీబీఎస్, ఎండీ పూర్తిచేసిన సుబ్బానాయుడు వైస్-ఛైర్మన్‌గా ఎన్నికైన కాల్వకొల్లు వెంకట సుబ్బానాయుడు తిరుపతి శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీ (1986)లో ఎంబీబీఎస్, 1992లో ఎండీ ఫల్మనాలజీలో పూర్తిచేశారు. నెలూరులోని నారాయణ మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పనిచేశారు.

# డిఎస్సీ 2025ను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం రాష్ట్ర హోంమంత్రి అనిత

**- చిత్తశుద్ధి, ప్రజలకు జవాబుదారిగా ఈ ప్రభుత్వం నిలుస్తుంది - డిఎస్సీపై ఎడాది పూర్తవుతున్న తరుణంలో ఇప్పుడు రాద్ధాంతం చేయడం హాస్యాస్పదం - స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్లు పబ్లిక్ డోమైన్‌లో ఉంచాము - అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చు**



**అమరావతి, (రాజధాని వార్తలు):** డిఎస్సీ 2025ను ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని రాష్ట్ర హోం శాఖామాత్యులు వంగలపూడి అనిత అన్నారు. ఏపీ సచివాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజలకు జవాబుదారిగా పని చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం కనీసం ఒక్క డిఎస్సీని కూడా నిర్వహించ లేకపోయిందని ఎన్నికలకు 60 రోజుల ముందు డిఎస్సీ నోటిఫికేషన్ కేవలం 6100 పోస్ట్ లతో వేశారని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. కానీ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో మెగా డిఎస్సీ నిర్వహించారని తెలిపారు. 8 సంవత్సరాల నిరీక్షణ అనంతరం కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సీని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తే ఇప్పుడు దాదాపు 8, 9 నెలల తరువాత రాద్ధాంతం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నో డిఎస్సీలు సమర్థవంతంగా నిర్వహించారని, ఆయా డిఎస్సీల ద్వారా ఇప్పటి వరకు దాదాపు 2 లక్షల మంది ఉపాధ్యాయులుగా సేవలు అందిస్తున్నారని మంత్రి అనిత గుర్తు చేశారు. వాస్తవంగా రాష్ట్రంలో సుమారు 3.11లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉంటే వారిలో 60 శాతం మంది ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే ఉద్యోగాలు సాధించారన్నది తేటతెల్లం అవుతుందని పేర్కొన్నారు. అంతెందుకు తాను సైతం 2001లో డిఎస్సీ ద్వారానే ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించానని 12 సంవత్సరాల సర్వీసు తర్వాత రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావడం జరిగిందని తెలిపారు. అందుకనే నా అనుభవంతో చెబుతున్నాను డిఎస్సీ నోటిఫికేషన్, ఎంపిక ప్రక్రియ, పోస్టింగ్స్ ఎలా జరుగుతాయో నాకు తెలుసని స్పష్టం చేశారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా డిఎస్సీ నిర్వహణ జరుగుతుందన్నారు. డిఎస్సీ 2025 నిర్వహణకు ప్రభుత్వం 240కి పైగా కోర్టు కేసులు దాటుకుని సుమారు 148 రోజుల్లోనే రికార్డు స్థాయిలో 16,347 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించిందని చెప్పారు. అంతేకాకుండా 15వేలకు పైగా టీచర్ పోస్టులు అతి గౌరవంగా వారికి అందించడం జరిగిందన్నారు. ఒకసారి అలోచిస్తే డిఎస్సీ నోటిఫికేషన్ వచ్చిన నాటి నుండి అభ్యర్థులు తమ కుటుంబాలకు దూరంగా ఎక్కడో సూదూర ప్రాంతాల్లో కోచింగ్ తీసుకుని మరీ సిద్ధం అవుతారన్నది వాస్తవమని అన్నారు. నెలలు సంవత్సరాల తరబడి శిక్షణ పొంది పరీక్ష వ్రాసి ఎంపికై సగౌవరంగా ఉద్యోగంలో చేరతారన్నది నిజమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన చేతుల మీదుగా డిఎస్సీ అభ్యర్థులకు అపాయింట్ మెంట్ ఆర్డర్‌లు అందించి దిశానిర్ధేశం చేశారని గుర్తు చేశారు. ఒక ఎమోషనల్ బాండింగ్ ఉన్న డిఎస్సీ పై అవాకులు చవాకులు పేలడం దారుణమన్నారు. నిబంధనల మేరకు డిఎస్సీ నిర్వహించి మూడు స్థాయిల్లో గ్రీవెన్స్ నిర్వహించి, గ్రీవెన్స్‌లో 34 వేలకు పైగా గ్రీవెన్స్ వస్తే వాటి అన్నింటిని పరిష్కరించి ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా డిఎస్సీ నిర్వహించామన్నారు. అత్యంత పకడ్బందీగా టీసీఎస్ ద్వారా దాదాపు 43వేల ప్రశ్నలను సిద్ధం చేసి మరీ డిఎస్సి నిర్వహించామన్నారు. స్పోర్ట్స్ కోటా కింద 3 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందని మంత్రి అనిత తెలిపారు. 3 శాతం రిజర్వేషన్ అంటే 421 పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించారని అయితే కేవలం అర్హులు 382 మందిని మాత్రమే భర్తీ చేయడం జరిగిందన్నారు. ఎంపికైన వారి సర్టిఫికెట్లను పబ్లిక్ డోమైన్ లో కూడా పెట్టడం జరిగిందని అవసరమైన వారు వాటిని పరిశీలించుకోవచ్చని అన్నారు. స్పోర్ట్స్ కోటా అయినా విద్యార్హతలు మాత్రం తప్పనిసరి అని అవి కూడా 15 మంది సభ్యుల బృందం పరిశీలించి మరీ ఎంపిక చేయడం జరిగిందన్నారు. స్పోర్ట్స్ కోటాకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల క్రీడా సర్టిఫికెట్లను ఫెడరేషన్‌లు, అసోసియేషన్‌లకు పంపించి వెరిఫై చేసి ఆ తర్వాత హారిజంటల్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. బ్రిడ్జి స్పోర్ట్స్ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలకు లోబడే ఆథరైజ్డ్‌గా తీసుకోవడం జరిగిందన్నారు. బ్రిడ్జి స్పోర్ట్స్‌ను ఏషియన్ గేమ్స్ 2018, 2022లో కూడా నిర్వహించారన్నారు. ఇందులో ఇండియాకు కాంస్య పతకం సైతం వచ్చిందన్నారు. గత ప్రభుత్వం గ్రూప్-1 ను అనేక అవకతవకలతో నిర్వహించి అభాసుపాలయిందని అటువంటి సంఘటనలు చంద్రబాబు పాలనలో ఒక్క సంఘటనైనా చూపాలని మంత్రి అనిత డిమాండు చేశారు.

# అంతర్జాతీయ ఫిడేరేటింగ్చెస్టోర్నమెంట్ నిర్వహణలో విట్ - ఏపి విశ్వవిద్యాలయ కృషిని ప్రశంసించిన క్రీడల మంత్రి






**అమరావతి, (రాజధాని వార్తలు):** విట్-ఏపి విశ్వవిద్యాలయంలో జరుగుతున్న విట్-ఏపి అమరావతి అంతర్జాతీయ ఫిడేరేటింగ్చెస్టోర్నమెంట్ - 2026 మూడవ రోజు పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్లో ఆరోరౌండ్పోటీల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యువజన సేవలు, క్రీడలు మరియు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న చెస్ క్రీడాకారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు ప్రదర్శించిన ఉత్సాహం, క్రమశిక్షణ, వ్యూహాత్మక ఆలోచనలను అభినందించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ టోర్నమెంట్ను విజయవంతంగా నిర్వహించి, యువ చెస్ ప్రతిభకు అద్భుతమైన వేదికను కల్పించినందుకు విట్-ఏపి విశ్వవిద్యాలయాన్ని అభినందించారు. విట్-ఏపి దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో ఒకటని పేర్కొన్న మంత్రి, విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించడంలో విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని ప్రశంసించారు. గౌరవముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అమరావతికి ప్రముఖ విద్యాసంస్థలను తీసుకు రావడం వల్ల ఈ ప్రాంతం విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందిందని, అందువల్లే అమరావతి అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ వంటి ప్రపంచ స్థాయి కార్యక్రమాలు ఇక్కడ నిర్వహించే అవకాశం కలిగిందని పేర్కొన్నారు. ఆధునిక విద్యలో క్రీడల ప్రాముఖ్యతను వివరిస్తూ, విద్యార్థుల శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం మరియు ఒత్తిడి నిర్వహణలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ నియామకాలలో క్రీడా కోటా ద్వారా సుమారు 400 మంది ఉపాధ్యాయులు ఎంపిక కావడం, క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహానికి నిదర్శనమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రసంగంలో దేశంలోనే అగ్రగామిగా ఎదగాలని ఆకాంక్షించిన మంత్రి, విద్యతో పాటు క్రీడలు కూడా సమానంగా అవసరమని అన్నారు. "రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను నిరంతరం ప్రోత్సహిస్తుంది. చెస్మేధస్సును పదును పెట్టడమే కాకుండా, విద్యార్థుల్లో మానసిక స్థైర్యం మరియు నిర్ణయాత్మక నైపుణ్యాలను పెంపొందిస్తుంది" అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విట్-ఏపి విశ్వవిద్యాలయ వైస్-చాన్సలర్డాక్టర్పి. అరుళ్మొళి వర్మన్మాట్లాడుతూ, చెస్ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహానికి గౌరవ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగంతో పాటు క్రీడారంగంలోనూ ప్రతిభను పెంపొందించేందుకు విట్-ఏపీ కట్టుబడి ఉందని, ఈ ప్రాంతంలో నిర్వహిస్తున్న అతిపెద్ద అంతర్జాతీయ ఫిడేరేటెడ్చెస్టోర్నమెంట్లలో ఇది ఒకటని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు యువ క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత రేటింగ్ కలిగిన ఆటగాళ్లతో పోటీ పడే అవకాశాన్ని కల్పిస్తాయని అన్నారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఛైర్మన్ కె.వి.వి.శర్మ మాట్లాడుతూ, చెస్ అభివృద్ధికి విట్-ఏపి విశ్వవిద్యాలయం అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. "అమరావతి అంతర్జాతీయ ఫిడేరేటింగ్చెస్టోర్నమెంట్ ఆంధ్రప్రదేశ్లో చెస్ అభివృద్ధికి ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్నిర్వహణలో ఆంధ్ర చెస్ అసోసియేషన్తో భాగస్వామ్యం చేసినందుకు విట్-ఏపికి కృతజ్ఞతలు. ఇలాంటి కార్యక్రమాలు యువప్రతిభకు విలువైన అవకాశాలు కల్పించడంతో పాటు, భారతదేశంలో ప్రముఖ చెస్ గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ ఎదగాలనేలక్ష్యానికి దోహదపడతాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో విట్-ఏపి రిజిస్ట్రార్డాక్టర్జగదీష్చంద్ర ముదిగంటి, విద్యార్థి సంక్షేమ విభాగం డిప్యూటీ డైరెక్టర్డాక్టర్ఖాదర్పాషా, ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.సురేష్, కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# 7న రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల పరిణయ పరిచయ వేదిక

## - జయప్రదానికి నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి పిలుపు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు ట్రంకు రోడ్‌లో ఉన్న టీవీఎస్ కళ్యాణ సదన్‌లో ఈనెల ఏడో తేదీ ఉదయం 9 గంటలకు రాష్ట్రస్థాయి ప్రథమ బ్రాహ్మణ వధూవరుల పరిణయ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్టు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి అధ్యక్షులు గుడ్లదొన వాసుదేవ రావు, ప్రధాన కార్యదర్శి దుద్దుకూరు రమేష్, కోశాధికారి రామా యణం మణిశంకర్, కార్యనిర్వాహక అధ్యక్షులు కురిచేటి లక్ష్మీనారా యణ, జి జయలక్ష్మి తెలిపారు. నెల్లూరులోని ప్రెస్ క్లబ్లో మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ సమితి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్యకు అనుబంధ సంస్థని వెల్లడించారు. పరిణయ పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఎన్నడూ లేని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తామని అన్నారు. బ్రాహ్మణ కుటుంబాల్లో వివాహాలు కానీ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన బ్రహ్మముడి బ్రాహ్మణ ఉచిత వివాహ సమాచార కేంద్ర కార్యాలయాన్ని టీవీఎస్ కళ్యాణ సదన్ దగ్గర్లో ప్రారంభించామన్నారు. బ్రహ్మముడిని ప్రారంభించి మూడు నెలలైన సందర్భంగా ఈ పరిణయ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వధూవరులకు ఎంట్రీ ఫీజు 101 రూపాయి మాత్రమేనని తెలిపారు. వాస్తవానికి ఫీజు లేకుండా చేయవచ్చునని, శుభకార్యమైనందున కనీస రుసుము తీసుకుంటున్నామని తెలిపారు. ఆ నూట ఒక్క రూపాయి కూడా వధూవరుల వివరాలతో కూడిన పుస్తకం తయారీకి సద్వినియోగం చేస్తామని చెప్పారు. బ్రహ్మముడి ప్రారంభించిన తర్వాత రెండు నెలల్లోపు మూడు వివాహాలు జరిపించామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఆన్లైన్ ద్వారా 200 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇంకా ఫోన్లలో నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. ఐదు రోజులే గడువు ఉన్నదని వధూవరులు బాధపడాల్సిన అవసరం లేదని, వేదిక జరిగే రోజు కూడా వివరాలను తీసుకుంటామని తెలిపారు. జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణ వధూవరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి టీవీఎస్ కళ్యాణ సదన్ మేనేజర్ దేశబొట్ల ఫణిరత్నం ఎంతగానో సహకరిస్తున్నారని అన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ బుచ్చి భువనేశ్వరి ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తడకవల్లి సుధారాణి, అదేవిధంగా ముఖ్య అతిథులు హాజరవుతారని తెలిపారు. అందరి సహకారంతో కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించి జయప్రదం చేస్తామని తెలిపారు. సమితి జిల్లా ప్రధాన కమిటీ, జిల్లా అర్చక సమాఖ్య సభ్యులు, జిల్లా మహిళా విభాగ కార్యవర్గ, జిల్లా యువజన విభాగ కార్యవర్గ, జిల్లా ప్రైవేట్ అర్చక పురోహిత కార్యవర్గ, జిల్లా అనుబంధ సంఘాల కార్యవర్గ సభ్యులు జిల్లాలోని బ్రాహ్మణ బంధువులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తొలుత సమితి సభ్యులు బ్రాహ్మణ వధూవరుల పరిణయ పరిచయ వేదిక బ్రోచర్లను విడుదల చేశారు. వివరాలకు 9848709424, 98492 19180లన సంప్రదించాలని కోరారు. సమా వేశంలో సభ్యులు బి.నాగలక్ష్మి, ఎం.విజయలక్ష్మి, పి.ఛాయా కుమారి, ఎం శ్రీధర్ శర్మ పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన కబడ్డీ సమ్మర్ కోచింగ్ క్యాంపు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** విద్యా నైపుణ్యానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని పలువురు అన్నారు. సామర్లకోటలోని బచ్చు ఫౌం డేషన్ మున్సిపల్ హై స్కూల్ ప్రాంగణంలో "సాప్" ఆధ్వర్యంలో కబడ్డీ సమ్మర్ కోచింగ్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. విద్యార్థులలో విద్యా నైపు ణ్యాలు, క్రీడా సామర్థ్యాలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు తమ ప్రతిభను మెరుగు పరుచుకోవడానికి ఇటువంటి కోచింగ్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. శిబిరంలో వివిధ విద్యా, క్రీడా, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే క్యాంప్ విజయవంతం కావడానికి సహకరించిన కాకినాడ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ కొండపల్లి శ్రీనివాస్, తాళ్లూరి వైకుంఠం, భోగిళ్ళ మురళి కుమార్, నిమ్మకాయల కిరణ్ కుమార్, కే శ్రీనివాస్, బి పవన్, జి రవి, ఈ వీరబాబు, పి అజయ్ కుమార్, బచ్చు ఫౌండేషన్ హై స్కూల్ యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : ఎంపీడీవో జె.శ్రీనివాస్




**కరప, (రాజధాని వార్తలు):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5వ తేదీన మండలంలోని 23 గ్రామ పంచాయతీ లలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి మొక్కలు నాటడం, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం, పర్యా వరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపడతామని కరప మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జటావల్లభుల శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. పైప్‌లైన్ మరమ్మతులు, మంచినీటి సర ఫరా, నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారి స్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎం ఎస్ హరేంద్ర ప్రసాద్ స్థానిక శాసనసభ్యుల పంతం నానాజీ ఆదేశాల మేరకు వేసవి కాలంలో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు కార్యదర్శు లతో సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. "స్వచ్ఛ-సురక్షిత జల వాయు" ప్రచార కార్యక్రమంలో భాగంగా గత నెల 25వ తేదీ నుంచి ఈ నెల 5వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 5న జరిగే గ్రామసభల్లో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, మొక్కల పెంపకం, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అలాగే ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలను ఫోటో ప్రదర్శన రూపంలో గ్రామసభల్లో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల అమలును పరిశీలించేందుకు అధికా రులు క్షేత్ర స్థాయి పర్యటనలు కూడా నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా శాఖ జూనియర్ ఇంజనీర్ వర్ధన్, గ్రామ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం




**గూడూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలోని ఏ సి ఏ సబ్ సెంటర్‌నందు గత నెల నాలుగో తారీఖు నుంచి ఈరోజు వరకు నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సబ్ సెంటర్ ఇన్చార్జి గూడూరు క్రికెట్ క్లబ్ అధ్యక్షులు కొణిదల మునిగిరీష్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఈ స్టేడియంలో ఈ సమ్మర్ క్రికెట్ కోచింగ్ నిర్వహిస్తున్నా మని అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా సుమారు నెల రోజుల పాటు ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహించామని, ఈ శిక్షణ శిబిరంలో సుమారు 80 మంది బాలురు మరియు బాలికలు పాల్గొన్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మా నెల్లూరుకంటే ముందు నుంచే ఈ స్టేడి యంలో ఈ సమ్మర్ క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ వస్తుం దేవారని, అలాగే రాష్ట్రంలో ఇక్కడ జరిగిన అన్ని టోర్నమెంట్లు మరి ఎక్కడ జరిగేవి కాదని అన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన టువంటి జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వేగురు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గతంలో బాలురు మాత్రమే క్రికెట్ పట్ల ఆసక్తి చూపియవారని, ఈ మధ్యకాలంలో బాలికలు కూడా ఎక్కువ మంది ఈ శిక్షణ శిబిరానికి వస్తున్నారని, వీరి మీద మహిళల ప్రపంచ కప్ విజయం ప్రభావం చూపించిందని అన్నారు. ఇంకా ఈ జిల్లా క్రికెట అసోసియేషన్ మాజీ సెక్రటరీ శ్రీనివాసులు రెడ్డి, అల్లూరి ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్ సెక్రటరీ తూపిలి నాగేశ్వ రరావు, శిక్షకులు సురేంద్రనాథ్ రెడ్డి, లవ కుమార, మహేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అనం తరం జిల్లా క్రికెట అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులందరికి సర్టిఫికెట్లను అంద జేశారు.

# క్షేత్రస్థాయిలో టిడిపి శ్రేణులు చైతన్యవంతంగా ఉండాలి

## - ఎస్ ఐ ఆర్ వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబు నాయుడు

**గూడూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో జరగనున్న ఎస్ఐఆర్‌పై బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించి వారిని చైతన్యవం తులుగా చేసేందుకు ఎమ్మెల్యేలు పార్టీ నాయకులు కృషి చేయాలని తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం మంగళగిరిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న (ఎస్ఐఆర్) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాపుకు గూడూరు నియోజకవర్గం శాసనసభ్యులు, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు.



# డీఎస్సీపై వైసీపీవి అడ్డగోలు అబద్ధాలు

## - వైసిపి నేతలపై మండిపడ్డ నెల్లూరు టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** డీఎస్సీ ఉద్యోగాల భర్తీపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, అడ్డగోలు అబద్ధాలని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే వారు అసత్య ప్రచారాలు చేస్తున్నారని టీడీపీ నెల్లూరు నగర అధ్యక్షుడు మామిడాల మధు తీవ్రంగా మండిపడ్డారు. నెల్లూరులో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో 16 వేలకు పైగా ఉద్యోగాలను అత్యంత పారదర్శకంగా భర్తీ చేశారని స్పష్టం చేశారు.
కేవలం 15 లక్షలకు ఉద్యోగాలు అమ్ము కున్నారంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి చేస్తున్న విమర్శల్లో ఎలాంటి నిజం లేదని, మెరిట్ సాధించిన అభ్యర్థులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉద్యో గాలు వచ్చాయని చెబుతూ పలువురు బాధితుల వివరాలను ఆయన మీడియా ముందుంచారు. అలాగే, గతంలో వైసిపి హయాంలో మైపాడు రోడ్డు నిర్వాసితులను రోడ్డున పడేస్తే, ప్రస్తుత మంత్రి పొంగూరు నారా యణ చొరవతో అక్కడ స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటు చేసి 120 కి పైగా కుటుంబాలకు కంటైనర్ షాపుల ద్వారా ఉపాధి కల్పించామని అన్నారు. నెల్లూరు నగరంలో అవినీతికి తావు లేకుండా అభివృద్ధి జరుగుతోందని, వైసిపి నాయకులు ఇప్పటికైనా అబద్ధాలు ప్రచారం చేయడం మానుకో వాలని మామిడాల మధు హితవు పలికారు.

# గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు తక్షణం కల్పించండి

## - ఐటీడీఏ సమావేశంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో గిరిజనులు ఎక్కువగా ఉన్న 20 గ్రామాలలో త్రాగునీరు, విద్యుత్, అంతర్గత రోడ్లు వంటి మౌలిక వసతులు తక్షణమే కల్పించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబదిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో ఐ.టి.డి.ఎ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యానాదులు, ఎరుకల, సుగాలీలు, చెంచులు, నక్కల వాళ్ళు అధికంగా ఉన్న గ్రామాలలో సంబందిత 24 శాఖలు గిరిజనుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల శాఖనుండి కనీసం 5 మందిని గుర్తించి వారిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగే విధంగా 3 నెలల్లోపల తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మత్స్య శాఖ కూడా చెరువులు, బోట్ల మంజూరు విషయంలో కనీసం 5 మందిని గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిచాలన్నారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. బడి పిలుస్తోంది కార్యక్రమం ద్వారా గిరిజన పిల్లలను ఎక్కువ మందిని బడులలో చేర్పించాలని సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో పని దినాల కల్పనలో కూడా ప్రాధాన్యత కల్పించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి శాఖ స్వయం సహాయక గ్రూపుల ఏర్పాటులో గిరిజనులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమములో ఐ.టి.డి.ఎ పి.డి శ్రీనివాసులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత, అన్ని కాలాలకు అనువైన గ్రామ రహదారుల వ్యవస్థ అవసరం

### - గ్రామీణ సమ్మిళితత్వానికి రాజమార్గం

దశాబ్దాలుగా, ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ మౌలిక సదుపా యాల ప్రణాళిక దీర్ఘకాలికంగా దూరదృష్టి లోపంతో సతమత మౌతోంది. ప్రతి వర్షాకాలంలో భారీ వర్షాలు పెళుసైన గ్రామీణ మార్గాలను కొట్టుకుపోతున్నాయి. గుంతలు ప్రమాదకరమైన గొయ్యిలుగా మారుతు న్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిచర్యగా ప్యాచ్‌లు వేయడం, పూడ్చడం, తాత్కాలికంగా రోడ్డును పునరుద్ధరించడం వంటి పనులతో హడావిడిగా స్పం దిస్తుంది. పరిపాలన పట్ల ఈ తాత్కాలిక విధానం ఇకపై ఆమో దయోగ్యం కాదు. ఆంధ్రప్రదేశ్ ఒక ఆర్థిక శక్తిగా మారాలంటే, రాష్ట్రం ప్రతిచర్యాత్మక నిర్వహణ నుండి దూరదృష్టితో కూడిన, దీర్ఘకాలిక వ్యూహానికి మారాలి. ప్రతి ఒక్క గ్రామం నలు మూలలా విస్తరించి ఉండే శాశ్వత, నాణ్యమైన, సమగ్రమైన రహదారుల వ్యవస్థను నిర్మించడం.

**"గుంతల రాజకీయాలను" అధిగమించడం**

ప్రస్తుత విధానం గ్రామీణ రహదారులను ద్వితీయ మౌలిక సదుపాయాలుగా పరిగణిస్తుంది–అవి పూర్తిగా ప్రయాణించలేనివిగా మారినప్పుడు మాత్రమే శ్రద్ధ అవసరమయ్యే ప్రధాన మార్గాలుగా చూస్తుంది. సాధారణ స్థానిక సంస్థల చర్యలు సాధారణంగా గుంతలను పూడ్చడం లేదా ఒకే సీజన్‌లో పాడైపోయే నాసిరకం కంకర రోడ్లను వేయడంపైనే దృష్టి పెడతాయి. ఈ "గుంతల రాజకీయాలు" ఆర్థికంగా క్షీణిం పజేస్తాయి, ఆర్థికంగా స్తంభింపజేస్తాయి:

**ఆర్థిక నష్టం:**

తాత్కాలిక మరమ్మతుల కోసం ఏటా లక్షలాది రూపాయలు ఖర్చవు తున్నాయి. ఇది చిన్న విషయాలలో పొదుపు చేసి, పెద్ద విషయాలలో తెలివితక్కువగా ప్రవర్తించడానికి ఒక చక్కటి ఉదాహరణ.

**మానవ నష్టం:**

ఒక గ్రామ రహదారి పాడైపోయినప్పుడు, మొత్తం జీవావరణ వ్యవస్థ స్తంభించిపోతుంది. రైతులు త్వరగా పాడైపోయే పంటలను కోల్డ్ స్టోరేజీలకు లేదా ప్రధాన మార్కెట్లకు రవాణా చేయలేరు, దీనివల్ల వారు తీవ్ర ఇబ్బందులకు గురై అమ్ముకోవలసి వస్తుంది. గర్భిణీ స్త్రీలు, వైద్య అత్యవసర పరిస్థితులలో ఉన్నవారు ఉప–విభాగ ఆసుపత్రులకు చేరుకోవడానికి ప్రాణాంతకమైన ఆలస్యాన్ని ఎదుర్కొంటారు. భారీ వర్షాల సమయంలో, చదువుకునే "మార్గం" అక్షరాలా బురదమ యమైపోవడం వల్ల పిల్లలు పాఠశాలకు వెళ్లలేరు. శాశ్వత రహదారి వ్యవస్థ అనేది ఒక విలాసం కాదు; అది ప్రాథమిక మానవ హక్కులకు, ఆర్థిక గౌరవానికి ఒక ప్రాథమిక అవసరం.

**దార్శనికత:**

ఏ గ్రామాన్నీ విడిచి పెట్టని గ్రిడ్ ఆంధ్రప్రదేశ్‌కు కావలసింది ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్. ఇది గ్రామాల అనుసంధానాన్ని, ఒక జాతీయ రహదారి ప్రాజెక్టుకు ఇచ్చేంతటి ఇంజనీరింగ్ పటిష్టతతో, బడ్జెట్ పరమైన ప్రాధాన్యతతో పరిగణించాలి. ఈ శాశ్వత నెట్‌వర్క్ మూడు రాజీపడని సూత్రాల ద్వారా నిర్వచించబడాలి:

1. నిర్మాణ శాశ్వతత్వం (వాతావరణ మార్పులను తట్టుకునే ఇంజనీరింగ్)

చౌకైన, సులభంగా కోతకు గురయ్యే పదార్థాలకు బదులుగా, గ్రామీణ రోడ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం వైట్–టాపింగ్ (కాంక్రీట్) లేదా ఉన్నత శ్రేణి, బహుళ పొరల బిటుమెన్ డిజైన్లను తప్పనిసరి చేయాలి. తీరప్రాంత, అంతర్గత ఆంధ్రలో తీవ్రమవుతున్న వాతావరణ పరిస్థితులు, భారీ వర్షాల దృష్ట్యా, గ్రామీణ మౌలిక సదుపాయాలకు ప్రధాన హంతకురాలైన నీటి నిల్వను నివారించడానికి ఈ రహదారులను సమీకృత మురుగునీటి పారుదల వ్యవస్థలతో నిర్మించాలి.

2. సంపూర్ణ విస్తరణ ("పొడవు మరియు వెడల్పు")

అనుసంధానం కేవలం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దనో లేదా ఒక ప్రధాన నివాస ప్రాంతం యొక్క ప్రధాన ద్వారం వద్దనో ఆగిపోకూడదు. ఈ నెట్‌వర్క్ ఒక గ్రామం మొత్తం భౌగోళిక స్వరూపాన్ని కవర్ చేయాలి, తద్వారా వ్యవసాయ క్షేత్రాలు, షెడ్యూల్డ్ కులాలు/తెగల కుగ్రామాలు, మారుమూల శివారు ప్రాంతాలు ప్రధాన గ్రిడ్‌కు సజావుగా అనుసంధానించబడాలి. నిజమైన అభివృద్ధి సమ్మిళితమైనది, మధ్యలోనే ఆగిపోయే రహదారి సగంలోనే విఫలమైన విధానంతో సమానం.

3. అంతరరవాణా ఆర్థిక సమైక్యత

ఈ శాశ్వత గ్రామ రహదారులు ఆధునిక వ్యవసాయ యంత్రాలు, వాణిజ్య రవాణా వాహనాలకు అనుకూలంగా ఉండేంత వెడల్పుగా ఉండాలి. వ్యవసాయ క్షేత్రాల నుండి రాష్ట్ర రహదారుల వరకు సరుకు రవాణా సజావుగా జరిగేలా చూడటం ద్వారా, గోదావరి జిల్లాల్లోని జలచర రైతులు, గుంటూరులోని మిరప రైతులు, రాయలసీమలోని పండ్ల తోటల రైతుల రవాణా ఖర్చులను ప్రభుత్వం గణనీయంగా తగ్గించగలదు.

**అమలుకు ఒక ప్రణాళిక**

ఇంతటి భారీ ప్రాజెక్టును అమలు చేయడానికి, విచ్ఛిన్న మైన, తాత్కాలిక కాంట్రాక్టర్ల వ్యవస్థల నుండి వైదొలగడం అవసరం. రాష్ట్ర ప్రభుత్వం బహుముఖ అమలు వ్యూహాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఏకీకృత గ్రామీణ మౌలిక సదుపాయాల నిధి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల నుండి నిధులను ఏకీకృతం చేసి, శాశ్వత గ్రామీణ ఆస్తుల సృష్టికి మాత్రమే ప్రత్యేకంగా కేటాయించిన ఒకే నిధిగా ఏర్పాటు చేయాలి.

ఆస్తుల మ్యాపింగ్, జవాబుదారీతనం: ప్రతి ఒక్క గ్రామీణ రహదారి విభాగం నిర్మాణాన్ని పర్యవేక్షించడానికి జిఐఎస్ మ్యాపింగ్‌ను ఉప యోగించాలి. కాంట్రాక్టర్లు తప్పనిసరిగా 5 నుండి 10 సంవత్సరాల నిర్వహణ నిబంధనకు కట్టుబడి ఉండాలి. తద్వారా, ఒకవేళ రహదారి గడువుకు ముందే పాడైపోతే, దాని ఆర్థిక భారం పన్ను చెల్లింపుదారులపై కాకుండా నిర్మాణదారుడిపైనే పడేలా చూడాలి. దశలవారీగా రాష్ట్ర వ్యాప్త అమలు: వ్యవసాయ ఉత్పత్తి, ఇప్పటికే ఉన్న కనెక్టివిటీ లోపాల ఆధారంగా గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అన్ని జిల్లాల్లో 100% శాశ్వత కనెక్టివిటీని సాధించడానికి కఠినమైన 5 సంవత్సరాల కాలపరి మితిని నిర్దేశించాలి. పెట్టుబడి బ్రోచర్‌లలో వంతెనలు, రహదారులు అద్భుతంగా కనిపిస్తాయి, కానీ ఒక రాష్ట్ర మానవ అభివృద్ధి సూచికలో నిజమైన మార్పును తీసుకు వచ్చేది మాత్రం సామాన్యమైన గ్రామ రోడ్డే. ఒక గ్రామం బాహ్య ప్రపంచంతో శాశ్వతంగా అనుసంధానమైనప్పుడు, భూమి విలువలు స్థిరపడతాయి, గ్రామీణ పరిశ్రమలలోకి ప్రైవేట్ పెట్టుబడులు నెమ్మదిగా ప్రవహిస్తాయి, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి జనసాంద్రత అధికంగా ఉన్న నగరాలపై వలసల ఒత్తిడి తగ్గుతుంది. ఒక మారుమూల గ్రామానికి శాశ్వత రహదారి వేయడం అనేది ఖర్చు కాదని, అది తరతరాల పెట్టుబడి అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రహించాలి. తాత్కాలిక మరమ్మతులకు ఉప యోగించే తారు బకెట్లను పక్కనపెట్టి, భారీ కాంక్రీట్ మిక్సర్లను రంగం లోకి దించాల్సిన సమయం ఆసన్నమైంది. ఆంధ్ర హృదయాన్ని దాని భవిష్యత్తుకు అనుసంధానిస్తూ, శాశ్వతంగా నిలిచే ఒక నెట్‌వర్క్‌ను నిర్మిద్దాం.

## బ్రాహ్మణ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి



**కాకినాడ, (రాజధాని వార్తలు):** బ్రాహ్మణుల ఐక్యత, సంక్షేమం లక్ష్యంగా జూలై 19న రాజమండ్రిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బ్రాహ్మణ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని బ్రాహ్మణ సంఘ నాయకులు, కార్యక్రమ ఆహ్వాన కమిటీ సభ్యులు భమిడిపల్లి వెంకట రమణమూర్తి (బాబు), కాకినాడ బ్రాహ్మణ సంఘం కన్వీనర్ వై.పద్మనాభ స్వామి పిలుపునిచ్చారు. ఈ సం దర్భంగా మంగళవారం కాకినాడ వార్పు రోడ్డులోని బ్రాహ్మణ సత్రం వద్ద సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో బ్రాహ్మ ణులు సామాజిక, ఆర్థిక పరమైన అనేక సవాళ్లను ఎదుర్కొం టున్నారని పేర్కొన్నారు. బ్రాహ్మణ సమాజంలో ఐక్యతను బలోపే తం చేయడానికి అందరూ ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ రంగాలకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులు సమావేశంలో పాల్గొనడం ద్వారా సమాజ సమస్యలపై అర్థవం తమైన చర్చలు జరిగే అవకాశముందని తెలిపారు. బ్రాహ్మ ణుల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, జనాభా పరమైన అంశాలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు సమావేశం ద్వారా కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. అలాగే హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి, బ్రాహ్మణ యువతీ యువకులకు వివాహాలపై అవగాహన, అర్చకులు, పురోహితులు మరియు బ్రాహ్మణుల రక్షణకు ప్రత్యేక చట్టాల అవసరం వంటి అంశాలపై నిపుణులు, పెద్దలతో చర్చాగోష్టులు నిర్వహించనున్నట్లు వెల్లడిం చారు. జూలై 19న రాజమండ్రిలోని ఏకేసీ కళాశాల సమీపంలోని మన్యం గార్డెన్స్‌లో జరిగే ఈ కార్యక్రమం విజయవంతం కావ డానికి బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన అన్ని సంఘాలు, అర్చకులు, పురో హితులు, వ్యాపారవేత్తలు, వివిధ వృత్తుల్లో ఉ న్న ప్రముఖులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందాళ రవి, దివి శ్రీనివాస్, బాదంపూడి బ్రదర్స్, నిముషకవి వెంకటేష్, వి.సూర్య ప్రకాశరావు, తురగా సాయి సుబ్బారావు, ఆకెళ్ల శ్రీనివాస్, రాయవరపు ప్రభాకర్ తదితరులు, అర్చక–పురోహిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏపీ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులుగా భగవాన్ రాజు

### - రాష్ట్ర ఆక్వా రైతు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్న ఆక్వా రైతులు





**అమలాపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో రొయ్యల కొనుగోలు, ఫీడ్ అమ్మకాలలో సిం డికేట్ వ్యవస్థ ప్రధాన సమస్య కాగా ఆక్వా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను అధిగమించేం దుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆక్వా రైతుల సంఘం అధ్యక్షులు దెందుకూరి సత్యనారాయణ రాజు అధ్యక్ష తన మంగళవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వచ్చిన ఆక్వా రైతు ప్రతినిధులతో సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు సమావే శం నిర్ణయించింది. సిండికేట్ వ్యవస్థతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ సమస్యను అధిగమించేందుకు ఆక్వా రైతుల ఉద్యమం చేపట్టి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి ఆక్వా రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి వివరిం చేందుకు, సిండికేట్ వ్యవస్థనుండి ఆక్వా రైతులు నష్టపోకుండా



ఉండేందుకు రాష్ట్ర ఆక్వా రైతు సంఘం కార్యవర్గం ఏర్పాటు చేయాలని ప్రతినిధులు భావించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షునిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు,జనరల్ సెక్రటరీగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన త్సవటపల్లి నాగభూ షణం, వైస్ ప్రెసిడెంట్‌గా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన యశ్వంత్ కుమార్, ట్రెజరర్‌గా ఉమ్మడి కృష్ణ జిల్లాకు చెందిన మధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బడా కంపెనీలకు పేదల స్థలాలు కట్టబెట్టొద్దు...నిరసనలో దవులూరి దొరబాబు




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** రామేశ్వరం మెట్ట జగనన్న కాలనీ లబ్దిదారుల ఇళ్ళ స్థలాలను వారికి అప్పగించాలని, జిందాల్ కంపెనీని అక్కడి నుండి తరలించాలని కోరుతూ పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద వైసీపీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. పెద్దాపురం వైసీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో జగనన్న కాలనీ లబ్ధిదారులతో ఆర్డీవో కార్యాల యాన్ని ముట్టడించి, పెద్దాపురం – సామర్లకోట రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం జగనన్న కాలనీ లేఅవుట్ నుండి జిందాల్ సంస్థకు చెందిన చెత్త నుండి విద్యుత్ తయారీ ప్లాంటును తరలించి, తమ స్థలాలు తమకు ఇప్పించాలని కోరుతూ ఆర్డీవోకి వినతి అందజేసారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ పెద్దాపురం నియోజకవర్గం నుండి మూడు సార్లు గెలిచి 12 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న చినరాజప్ప పేదల సొంతింటి కలను నాశనం చేయడానికి సిద్ధమయ్యారన్నారు. ఉ మ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల నుండి తిరస్కరించిన జిం దాల్ ప్లాంటును ఎమ్మెల్యే రాజప్ప పెద్దాపురంకు తీసుకు వచ్చారని, చివరకు అక్రమ లేఅవుట్‌ల నుండి, చివరకు చెత్త నుండి కూడా ఎమ్మెల్యే రాజప్ప తనయుడు డబ్బులు సంపాదిస్తున్నారని ఆరోపించారు. జగనన్న కాలనీ లేవుట్ నుండి జిందాల్ ప్లాంట్ తరలించే వరకూ తమ పోరాటం ఆగదన్నారు. పేదలకు కేటాయించిన ఇళ్ళ స్థలాలను తిరిగి వారికే ఇవ్వాలని, చినరాజప్ప నా వ్యక్తిగత విషయాలపై కాకుండా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెడితే బాగుటుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్ మోజేష్, రాష్ట్ర ఐఆర్ఎఫ్ కార్పొరేషన్ నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు కంటే వీరరాఘవులు, నేతల హరిబాబు, చిట్టిమాని శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో జగనన్న లేఔట్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆంధ్ర ప్రీమియం లీగ్‌కు ఎంపికైన తడ యువకుడు



**తడ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగ బోయే ఆంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌కు రాయల్స్ ఆఫ్ రాయలసీమ కింగ్స్ జట్టుకు ఎంపికయ్యాడు. తడ గ్రామానికి చెందిన పూర్ణచంద్ర గణేష్, వయసు 20 అను యువకుడు ఎంపిక కావడంతో వారి తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

## ఆర్డీవోను కలిసిన మున్సిపల్ కమిషనర్



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం ఆర్డీవో, ప్రత్యేక అధికారి పి కృష్ణమూర్తిని పెద్దాపురం మున్సిపల్ కమీషనరు కే శ్రీకాంత్ రెడ్డి మర్యాద పూర్వకముగా కలసి అభినందనలు తెలిపారు. మంగళవారం కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవోను కలిసి మున్సిపాలిటీకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీకి సంభందించి పలు విషయాలను కమిషనర్ ఆర్డీవో తో కలసి చర్చించారు.

## రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలి: అద్దంకి దయాకర్




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** మాజీ మంత్రి హరీష్‌రావుతో రాజకీయంగా ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తించారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శిం చారు. సీఎల్పీ మీడియా హాల్‌లో నిర్వహించిన మీడియా సమా వేశంలో ఆయన పలు రాజకీయ అంశాలపై స్పందించారు. హరీష్‌రావుతో కేటీఆర్ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని, బీఆర్ఎస్‌లో నాయకత్వ సంక్షోభం నెలకొందని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా అద్దంకి దయాకర్ విమర్శలు చేశారు. పదవుల కోసం త్యాగాలు చేశానని చెప్పే కేసీఆర్, ప్రతిపక్ష నాయకుడి హోదాకు రాజీనామా చేయాలన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై వస్తున్న విమర్శలను ఖండించిన ఆయన, భవిష్యత్తు లేని నాయకులకే ఫ్యూచర్ సిటీపై భయం పట్టుకుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టాప్–100 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి తీసుకొచ్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అలాగే మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంపై కేటీ ఆర్‌కు పూర్తి అవగాహన లేదని, అవసరమైతే దానిపై ప్రత్యేకంగా క్లాస్ చెబుతామని ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకత్వంపై సొంత పార్టీ నేతలకే నమ్మకం లేదన్న అద్దంకి దయాకర్, ప్రజలు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. రెచ్చగొట్టే రాజకీయాలు చేసి లబ్ధి పొందాలని ప్రయత్నించవద్దని ప్రతిపక్షాలకు అద్దంకి దయాకర్ సూచించారు.

## భూముల మార్కెట్ విలువల సవరణకు టీజి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ఫ్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని 144 సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్, అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ఫ్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ఫ్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే HMDA, CURE, ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది.

# 100 రోజులు ఆడిన మొదటి సినిమా ఈ హీరోదే.. అక్కడే ఆ ట్రెండ్ మొదలైందా?



నటసింహం నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తూ వరుస హిట్లతో దూసుకుపోతున్నారు. రీసెంట్‌గా 'అఖండ 2'తో మరో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారాయన. అయితే బాలయ్య కెరీర్‌లో మైల్‌స్టోన్‌గా నిలిచిన ఒక సినిమా, సౌత్ ఇండియాలోనే సరికొత్త ట్రెండ్ సెట్ చేసింది. టాలీవుడ్ చరిత్రలోనే ఏకంగా 100 కేంద్రాలలో 100 రోజులు ఆడిన మొదటి సినిమాగా రికార్డు సృష్టించింది. ఆ సినిమా వెనుక ఉన్న క్రేజీ విశేషాలు మీకోసం..

**చరిత్ర సృష్టించిన 'నరసింహ నాయుడు':**

2001 సంక్రాంతి కానుకగా జనవరి 11న విడుదలైన 'నరసింహ నాయుడు' సినిమా టాలీవుడ్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. అప్పట్లో కేవలం 6 కోట్ల రూపాయల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, ఏకంగా 25 కోట్ల రూపాయల వసూళ్లను సాధించింది. ఇక తెలుగు సినిమా హిస్టరీలో 25 కోట్ల క్లబ్‌లో చేరిన మొదటి సినిమా ఇదే కావడం విశేషం. అంతేకాదు, సౌత్ ఇండియాలోనే 100 కేంద్రాలలో విజయవంతంగా 100 రోజులు పూర్తి చేసుకున్న తొలి చిత్రంగా ఇండస్ట్రీ హిట్ కొట్టింది.

**కంటి చూపుతో చంపేస్తా.. డైలాగ్ సీక్రెట్:**

ఈ సినిమాకు పరుచూరి గోపాలకృష్ణ రాసిన డైలాగులు థియేటర్లలో ఈలలు వేయించాయి. షూటింగ్ చివర్లో ఒక డైలాగ్ సీన్‌ను మరింత పవర్‌ఫుల్‌గా మార్చడానికి, ఆయన లెజెండ్రీ నటుడు ఎన్టీ రామారావు గారిని ఊహించుకుని ఒక లైన్ రాశారు. అదే.. "కత్తులతో కాదురా కంటి చూపుతో చంపేస్తా" అనే పవర్‌ఫుల్ డైలాగ్. ఈ డైలాగ్ విన్న వెంటనే కథా రచయిత చిన్నికృష్ణ, ఈ సినిమా 200 రోజులు కాదు ఏకంగా 300 రోజులు ఆడుతుందని అప్పుడే జోస్యం చెప్పారు.

**ఎడిటింగ్‌లో మారిన ఇంటర్వెల్ సీన్:**

ఈ సినిమా ఎడిటింగ్ సమయంలో మేకర్స్‌కు ఒక పెద్ద టాస్క్ ఎదురైంది. మొత్తం ఫుటేజ్ చూసుకుంటే ఏకంగా 17,000 అడుగుల లెంగ్త్ వచ్చింది. దీంతో నిడివిని తగ్గించడం కోసం మొదటి సగంలో చాలా సీన్లను కత్తిరించాల్సి వచ్చింది. నిజానికి మొదట 30 టాటా సుమోలతో వచ్చే రైల్వే స్టేషన్ ఫైట్ సీన్‌ను ఇంటర్వెల్‌గా అనుకున్నారు. కానీ సీన్లు కట్ అవ్వడంతో, చివరికి బాలకృష్ణ–సిమ్రాన్ పెళ్లి సీన్‌ను ఇంటర్వెల్ పాయింట్‌గా లాక్ చేశారు.

**బాలయ్య నమ్మకం.. తొలి నంది అవార్డు:**

సినిమా రిలీజ్‌కు రెండు వారాల ముందే బాలకృష్ణ ఎంతో కాన్ఫిడెంట్‌గా వరుస ఇంటర్వ్యూలు ఇచ్చారు. "ఎప్పుడెప్పుడు జనవరి 11 వస్తుందా, ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ అని అందరు అంటారా అని వెయిట్ చేస్తున్నా" అని ఆయన నమ్మకంగా చెప్పారు. ఆయన నమ్మినట్టే.. అదే రోజు పోటీగా వచ్చిన మృగరాజు, దేవి పుత్రుడు సినిమాలను వెనక్కి నెట్టి నరసింహ నాయుడు సంక్రాంతి విన్నర్‌గా నిలిచింది. ఈ సినిమాలో అద్భుత నటనకు గానూ బాలకృష్ణకు కెరీర్‌లో మొదటిసారి 'ఉత్తమ నటుడు'గా నంది అవార్డు కూడా దక్కింది.

అప్పట్లో 100 సెంటర్లలో 100 రోజులు ఆడడం అనేది ఒక అసాధ్యమైన రికార్డ్. అలాంటి హిస్టారికల్ ట్రెండ్‌ను బాలకృష్ణ 'నరసింహ నాయుడు' సినిమాతోనే మొదలుపెట్టారు. ఇక అప్పట్లో క్రియేట్ చేసిన ఆ మాస్ మేనియానే, నేటికీ బాలయ్యను బాక్సాఫీస్ దగ్గర అన్‌స్టాపబుల్ కింగ్‌గా నిలబెట్టిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు!


# బుచ్చిబాబు.. తారక్ నుంచి పిలుపు ఇప్పట్లో కష్టమేనేమో!



డైరెక్టర్ బుచ్చిబాబు సనా తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా మూవీ పెద్ది రిలీజ్‌కు సిద్ధమవుతున్న వేళ, ఆయన నెక్స్ట్ ప్రాజెక్ట్ పై అప్పుడే చర్చ మొదలైంది. ముఖ్యంగా యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్‌తో బుచ్చిబాబు సినిమా ఎప్పుడు ఉంటుందనే విషయం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. నిజానికి ఉప్పెన సినిమాతో దర్శకుడిగా తొలి ప్రయత్నంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న బుచ్చిబాబు, ఆ తర్వాత చాలా కాలం పాటు కొత్త ప్రాజెక్టును ప్రకటించలేదు. ఆ గ్యాప్‌లో ఎన్టీఆర్ కు ఓ కథ వినిపించారని, అదే కథ తర్వాత రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పెద్దిగా మారిందనే ప్రచారం సోషల్ మీడియాలో చాలా రోజుల పాటు సాగింది. అయితే తాజాగా ఆ రూమర్లకు బుచ్చిబాబు స్వయంగా చెక్ పెట్టారు. ఇప్పుడు పెద్ది ప్రమోషన్లలో భాగంగా మాట్లాడిన బుచ్చిబాబు, ఎన్టీఆర్ కు తాను చెప్పిన కథ పూర్తిగా వేరేనని క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రేక్షకుల ముందుకు వస్తున్న పెద్ది కథకు, తారక్ కు వినిపించిన దానికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఎన్టీఆర్‌కు తాను చెప్పిన కథను మరింత డెవలప్ చేసి తీసుకురావాలని సూచించారని, కానీ మధ్యలో పెద్ది అవకాశం రావడంతో తన దృష్టంతా ఆ ప్రాజెక్టుపైనే పెట్టినట్లు వెల్లడించారు. అలాగే ఫ్యూచర్‌లో ఎన్టీఆర్ పిలిస్తే కథ చెప్పడానికి తాను సిద్ధంగా ఉంటానని కూడా బుచ్చిబాబు తెలిపారు. దీంతో గతంలో వచ్చిన అనేక ఊహాగానాలకు ముగింపు పడినట్టైంది. ఎన్టీఆర్ పెద్ది కథను రిజెక్ట్ చేశారన్న ప్రచారంలో నిజం లేదని క్లారిటీ వచ్చింది. అయితే బుచ్చిబాబు ఇంట్రెస్ట్ చూపుతున్నా, ఎన్టీఆర్‌తో సినిమా ఇప్పట్లో సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉందా అనే ప్రశ్న మిగిలే ఉంది. ప్రస్తుతం తారక్ వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న డ్రాగన్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఆ మూవీ రిలీజ్ కానుండగా.. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. అదే సమయంలో దేవర సీక్వెల్‌ను పూర్తి చేయాల్సి ఉంది. మరోవైపు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో ఎన్టీఆర్ ఓ సినిమా చేయనున్నట్లు చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. ఆ చిత్రానికి సంబంధించిన చర్చలు కూడా కొనసాగుతున్నాయి. త్వరలో అధికారిక ప్రకటన రానుందని టాక్. ఇలా ఇప్పటికే చేతి నిండా సినిమాలతో తారక్ బిజీగా ఉండటంతో, కొత్త దర్శకుడితో వెంటనే సినిమా ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదని చెప్పాలి. అందుకే బుచ్చిబాబు–ఎన్టీఆర్ కాంబినేషన్ పై ఆసక్తి ఉన్నప్పటికీ, ఇప్పట్లో వర్కౌట్ అయ్యే అవకాశాలు తక్కువే. అదే సమయంలో పెద్ది రిజల్ట్ కూడా బుచ్చిబాబు కెరీర్‌కు కీలకంగా మారనుంది.

బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధిస్తే, ఫ్యూచర్ లో స్టార్ హీరోలతో వర్క్ చేసే అవకాశాలు రావడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది. అలాంటి పరిస్థితిలో ఎన్టీఆర్‌తో మూవీ ఓకే అయితే అది కచ్చితంగా భారీ ప్రాజెక్టుగా మారే అవకాశం ఉంది. కానీ అయితే బుచ్చిబాబు సిద్ధంగా ఉన్నా, తారక్ డైరీలో ఖాళీ దొరకడం అంత ఈజీ కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# జాన్వీ, చరణ్.. ఫోకస్ లోకి వచ్చిన రొమాంటిక్ సీన్



రామ్ చరణ్, జాన్వీ కపూర్ నటించిన 'పెద్ది' సినిమాలో ఒక లిప్ లాక్ సీన్ ఉందనే విషయం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో బాగా నానుతోంది. ఈ సన్నివేశం గురించి సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఒక ఇంటర్వ్యూలో హింట్ ఇవ్వడంతో విషయం ట్రేండింగ్‌లోకి వచ్చేసింది. చరణ్ ఈ ముద్దు సీన్‌లో చాలా బాగా నటించాడని రెహమాన్ ఓపెన్‌గా చెప్పడం విశేషం. ఒక స్టార్ కంపోజర్ రేంజ్ వ్యక్తి సినిమాలోని ఇలాంటి ఒక రొమాంటిక్ సీన్ గురించి మాట్లాడటంతో, అసలు స్క్రీన్‌పై ఆ ఎమోషన్ ఏ రేంజ్‌లో ఉండబోతోందో అని ప్రేక్షకులు మాట్లాడుకుంటున్నారు. గతంలో వచ్చిన 'రంగస్థలం' సినిమాలో కూడా రామ్ చరణ్ ఒక కిస్ సీన్‌లో కనిపించాడు. అయితే ఆ సన్నివేశంలో సమంతే చరణ్ కు ముద్దు పెడుతుంది, చిట్టిబాబు పాత్ర కేవలం అలా ఉండిపోతుంది. అప్పట్లో కాస్త మొహమాట పడుతూ కనిపించిన చరణ్, ఇప్పుడు జాన్వీ కపూర్ తో ఎలాంటి సీన్ చేశాడనేది ఆసక్తికరంగా మారింది. పాత సినిమా తరహాలోనే ఇది కూడా ఒక నార్మల్ సీన్‌లా ఉంటుందా లేక కథలో భాగంగా అంతకుమించి ఇంటెన్స్‌గా డిజైన్ చేశారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బుచ్చిబాబు మేకింగ్‌ను బట్టి చూస్తే కేవలం గ్లామర్ కోసమే కాకుండా స్టోరీ డిమాండ్ బట్టే ఈ సీన్ వచ్చే అవకాశం ఉందని చెప్పవచ్చు. దర్శకుడు బుచ్చిబాబు సనా ఈ సినిమాను ఒక పక్కా రూరల్ డ్రామాగా తెరకెక్కించాడు. కథలోని ఇంటెన్సిటీని పెంచేందుకే ఈ సీన్ పెట్టారని చిత్ర బృందం అంటోంది. చరణ్ తన పాత్రలో పూర్తిగా లీనమైపోయాడని, క్యారెక్టర్ డిమాండ్ చేసిన ప్రతి ఒక్కటి స్క్రీన్‌పై పర్ఫెక్ట్‌గా ప్రెజెంట్ చేశాడని డైరెక్టర్ క్లారిటీ ఇచ్చాడు. నటుడిగా తనను తాను మార్చుకుంటూ చరణ్ చేసిన ఈ ప్రయత్నం కచ్చితంగా సినిమాకు హైలైట్‌గా మారుతుందని మేకర్స్ నమ్ముతున్నారు. హీరోయిన్ జాన్వీ కపూర్ ఈ ప్రాజెక్ట్‌ను నార్త్ తో పాటు సౌత్ లో కూడా గట్టిగా ప్రమోట్ చేసింది. ఇలాంటి సున్నితమైన సన్నివేశాలు ఉన్నప్పుడు కొందరు అభిమానులు నెగిటివ్‌గా రియాక్ట్ అయ్యే ఛాన్స్ కూడా ఉంది.

నేటి తరం ప్రేక్షకులు సినిమాను చూసే విధానం మారింది కాబట్టి, కథలో ఆ సీన్‌కు సరైన జస్టిఫికేషన్ ఉంటే కచ్చితంగా యాక్సెప్ట్ చేస్తారు. కేవలం కమర్షియల్ హంగుల కోసం కాకుండా సీన్‌లోని డెప్త్‌ని బట్టి జనాల రెస్పాన్స్ ఆధార పడి ఉంటుంది. మరో కొన్ని గంటల్లో సినిమా థియేటర్లలోకి రాబోతుండటంతో ఈ కిస్సింగ్ సీన్ వెనుక ఉన్న అసలు నిజం ఏంటనేది తేలిపోనుంది. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ చిత్రంలో చరణ్ సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నాడు. ఏఆర్ రెహమాన్ అందించిన సాంగ్స్ ఆల్రెడీ హిట్టయ్యాయి. గ్లామర్‌తో పాటు బలమైన కంటెంట్ ఉన్న ఈ స్పోర్ట్స్ డ్రామా బాక్సాఫీస్ దగ్గర ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి.

# వేట్రిమారన్ మాస్టర్ ప్లాన్.. ధనుష్, శింబును కలిపేస్తున్నాడా?



తమిళ సినీ పరిశ్రమలో ఎన్నో ఏళ్లుగా చర్చకు దారి తీస్తున్న ధనుష్ – శింబు ఈక్వేషన్ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు ఇద్దరూ యంగ్ స్టార్ హీరోలుగా ఇండస్ట్రీని శాసించిన ఈ నటులు పలు సందర్భాల్లో స్నేహపూర్వకంగా కనిపించినప్పటికీ, వారి మధ్య అంతా సవ్యంగానే ఉందా అనే సందేహాలు మాత్రం ఎప్పుడూ వినిపిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యతో శింబు ప్రేమలో ఉన్నారనే వార్తలు గతంలో వచ్చిన తర్వాత, ఆమె ధనుష్‌ను పెళ్లి చేసుకోవడం ఈ ఇద్దరి మధ్య దూరానికి కారణమైందనే ప్రచారం చాలాకాలంగా కొనసాగుతోంది. అఫీషియల్‌గా ఎప్పుడూ ఎవరూ దీనిపై స్పందించకపోయినా, కోలీవుడ్ వర్గాల్లో ఈ అంశం తరచూ చర్చకు వస్తూనే ఉంటుంది. ఇప్పుడు ఈ ఇద్దరు హీరోలను ఒకే సినిమాతో మళ్లీ కలిపే ప్రయత్నం జరుగుతోందనే వార్తలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. టాలెంటెడ్ డైరెక్టర్ వెట్రిమారన్ ప్రస్తుతం శింబు హీరోగా తెరకెక్కిస్తున్న అరసన్ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా తన కల్ట్ క్లాసిక్ వడ చెన్నై యూనివర్స్‌లోనే సాగుతుందని, కథాపరంగా ఆ ప్రపంచానికి అనుసంధానంగా ఉంటుందని కోలీవుడ్ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ఇదే నేపథ్యంలో వడ చెన్నైలో ప్రధాన పాత్ర పోషించిన ధనుష్‌ను సినిమాలో స్పెషల్ గెస్ట్ రోల్ కోసం సంప్రదించారనే వార్తలు బయటకు వచ్చాయి. కేవలం రెండు నిమిషాల నిడివి ఉన్న ఈ క్యామియో పాత్ర కథకు కీలకంగా ఉండబోతుందని ప్రచారం జరుగుతోంది. ఈ వార్తల్లో ఎంతవరకు నిజముందో ఇంకా అఫీషియల్ ఇన్ఫర్మేషన్ లేకపోయినా, వేట్రిమారన్ కోసం ధనుష్ ఈ రోల్ చేయడానికి సిద్ధమవుతున్నారనే టాక్ కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ధనుష్, వేట్రిమారన్ కాంబినేషన్‌కు ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు ఉంది. పొల్లాధవన్, ఆడుకలం, అసురన్, వడ చెన్నై వంటి సినిమాలు వీరి కాంబినేషన్ కు అపారమైన క్రేజ్ తీసుకొచ్చాయి. అలాంటి డైరెక్టర్ అడిగితే, పర్సనల్ రీజన్స్ కు పక్కన పెట్టి ధనుష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే జరిగితే, ధనుష్, శింబు ఒకే సినిమాలో కనిపించడం అభిమానులకు పెద్ద సర్‌ప్రైజ్‌గా మారవచ్చు. ఇక ప్రస్తుతం తమిళ సినీ పరిశ్రమ పరిస్థితులు కూడా కొత్త ప్రయోగాలకు దారి తీస్తున్నాయి. ఒకప్పుడు కమర్షియల్ ఫార్ములాతో వరుస సక్సెస్‌లు సాధించిన పలువురు స్టార్ హీరోలు ఇప్పుడు ఆశించిన ఫలితాలు అందుకోలేకపోతున్నారు. మరోవైపు కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు కూడా ప్రతిసారీ ప్రేక్షకుల ఆదరణ పొందడం లేదు.

దీంతో డైరెక్టర్లు, హీరోలు కొత్త కాంబినేషన్లు, విభిన్న కథలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అరసన్ వంటి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. అయితే ఈ మొత్తం డిస్కషన్‌కు ఫుల్‌స్టాప్ పడాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ధనుష్ నిజంగానే శింబు సినిమాలో క్యామియో చేస్తారా? లేక ఇది కేవలం ప్రచారమేనా? అన్న ప్రశ్నలకు సమాధానం దొరికే వరకు కోలీవుడ్‌లో ఈ వార్త హాట్ టాపిక్‌గా కొనసాగడం మాత్రం ఖాయంగా కనిపిస్తోంది.

# పేకాట శిబిరంపై దాడి

## - పేకాట రాయుళ్లపై కేసు నమోదు - 1,73,690/- నగదు, 8 ఆండ్రాయిడ్ మొబైల్స్ సీజ్ : ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని మరుపల్లి గ్రామ శివార్లలో విజయనగరం స్పెషల్ బ్రాంచ్‌కి వచ్చిన సమా చారం ప్రకారం, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సహకారంతో గజపతి నగరం పోలీస్ సిబ్బంది మంగళవారం నాడు పేకాట శిబిరంపై దాడి చేయడం జరిగిందని గజపతినగరం సబ్ ఇన్స్పెక్టర్ కే. కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు అందించిన సమాచారం ప్రకారం ఈ దాడిలో వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది పేకాట రాయుళ్లను పట్టుకొని వారి వద్ద నుంచి 1,73,890/- నగదు, 8 ఆండ్రాయిడ్ మొబైల్స్, ఒక తెల్లని గోనె సంచి, 52 జూద పరికరాలను సీజ్ చేయడం జరిగిందని అన్నారు. పేకాటలో పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్.ఐ కే కిరణ్ కుమార్ నాయుడు అన్నారు. ఈ దాడిలో గజపతినగరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సురక్షిత సమాజానికి ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం : ఎస్సై యు.మహేష్





**బొండపల్లి, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** మండలంలోని ఓంపల్లి గ్రామంలో గ్రామస్తులకు ఎస్.ఐ యు.మహేష్ పలు అంశాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ యు.మహేష్ మాట్లాడుతూ సమాజం సురక్షితంగా ఉండాలంటే ప్రతి ఒక్కరికి పలు అంశాల పట్ల అవగాహన తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మొబైల్లో తెలియని లింకులను తెరవరాదని ఆయన అన్నారు. దొంగతనాలు జరగ కుండా గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. అదేవిధంగా మహిళలపై ఎటువంటి దాడులు జరిగిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్.ఐ యు మహేష్ అన్నారు.

గ్రామస్తులు రహదారి ప్రయాణాలు చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై యు.మహేష్ సూచించారు. హెల్మెట్ ధరించడం వలన ప్రాణహాని జరిగే అవకాశం చాలా తక్కువ ఉంటుందని ఆయన అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని, నాలుగు చక్రాలు వాహనాలు నడిపే వాళ్ళు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని ఎస్.ఐ యు.మహేష్ మహేష్ అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై జరిగిన వర్క్ షాప్‌లో శ్రావణి రెడ్డి

**గూడూరు, (రాజధాని వార్తలు):** దేశ వ్యాప్తంగా జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) పై అవగాహన కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో మంగళవా రం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో సీని యర్ నాయకులు వక్తలు మాట్లాడుతూ ఎస్ఐఆర్‌పై బూత్ స్థాయి నుండి ప్రతి కార్యకర్తకు అవగాహన ఉండేలా వివరిం చాలన్నారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ జరిగేటప్పుడు ప్రతి బూత్ ఏజెంటు సిబ్బందితో కలిసి ఉండాలని ఏవైనా అనుమానాలు ఉంటే అప్పుడే నివృత్తి చేసుకోవాలని తెలిపారు.



# 290 ఉద్యోగాలకు నోటిఫికేషన్




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) 290 ఉద్యోగాలకు సంబంధించి మూడు నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఇందులో రోడ్లు, భవనాల శాఖలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ సివిల్ ఇంజినీర్ (ఏఈఈ) ఉద్యోగాలు ఉండగా, 49 ఏఈఈ ఎలక్ట్రికల్ ఉద్యోగాలు ఉన్నాయి. అలాగే, కాలుష్య నియంత్రణ మండలిలో 19 ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టుల ను భర్తీ చేయనున్నారు. 18 నుంచి 44 ఏళ్లలోపు వారిని అర్హులుగా నిర్ణయించారు. పరీక్షలన్నీ ఓఎంఆర్ (ఆఫ్‌లైన్) విధానం లేదా సిబిటి (ఆన్‌లైన్) పద్ధతిలో నిర్వహిస్తామని, దీనిపై త్వరలో స్పష్టత ఇస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి హరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 నుంచి జూలై 13 వరకు ఏఈఈ సివిల్ ఉద్యోగాలకు, ఈనెల 10 నుంచి జూలై 17 వరకు ఏఈఈ ఎలక్ట్రికల్ ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 8 నుంచి జూలై 15 వరకు కాలుష్య నియంత్రణ మండలి పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తామని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం.. క్రైస్తవ మతంలోకి మారిన వారిని ఎస్సీ, ఎస్టీలుగా పరిగణించబోమని కమిషన్ స్పష్టత ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ విభాగంలో దరఖాస్తు చేసేవారు సమర్పిం చాల్సిన ధ్రువపత్రాలను నోటిఫికేషన్లో పేర్కొంది.

# మార్చి 2027 నాటికి రీ సర్వే పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 2027 మార్చి నెల నాటికి రీ సర్వే ప్రక్రియ పూర్తి చేసి ప్రతి రైతుకు పట్టాదారు పాసుపుస్తకం అందించేలా చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమా వేశం నిర్వహించి రెవెన్యూ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2027 వ సంవత్సరం మార్చి నెల నాటికి ఈ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు నిర్ణయించిందని, కావున ప్రణాళిక ప్రకారం రీ సర్వే పూర్తి చేసి మార్చి నెల నాటికి ప్రతి రైతుకు పూర్తి భూ వివరాలతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం అందిం చాలని తెలిపారు. అందుకుగాను ప్రణాళిక రూపొందించడం జరిగిందని ఇప్పటివరకు మూడు విడతలలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ పూర్తి చేయాల న్నారు.

అదేవిధంగా లక్షా ఏడు వేల జాయింట్ ఎల్పీఎంలను జూలై 15 నాటికి సరిచేయాలన్నారు. నాలుగవ విడతలో 126 గ్రామాలు, మరియు ఐదు విడతలో 100 గ్రామాలలో సర్వే పూర్తి చేయాలని తెలిపారు. రెవిన్యూ రికార్డుల డిజిటలైజేషన్ పూర్తి చేయాలని, రెవిన్యూ క్లినిక్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలు, మ్యుటేషన్‌లు, 22 ఏ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేథు మాధవన్, డి ఆర్ ఒ సత్తిబాబు, ఆర్ డి ఒలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

# పోస్టల్ పథకాలపై అవగాహన కార్యక్రమం

## - సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ బి.ఉపేంద్ర

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని పాతబగ్గం గ్రామంలో ఉపాధి హామీ వేతనదారులకు పోస్టల్ పథకాలు పై మంగళవారం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ బొద్దల ఉపేంద్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర వేతన దారులతో మాట్లాడుతూ పోస్టల్ పొదుపు, బీమా పథకాలను వేతన దారులు వినియోగించుకోవాలని సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కోరారు. మట్టి పనులు జరుగుతున్న ప్రదేశానికి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర వెళ్ళి పొదుపు పథకాలైన సుకన్య సమృద్ధి, మంత్లీ ఇన్కమ్ స్కీమ్ తదితర పథకాల గురించి వేతనదారులకు క్షుణ్ణంగా వివరించారు.అదే విధంగా విజయనగరం డివిజన్ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐ పి పి బి) బ్రాంచ్ మేనేజర్ సతీష్ ప్రమాద బీమాపై మాట్లాడారు. పాముకాటు, విద్యుత్తు షాక్, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఈ యొక్క బీమా చేసుకున్న వారి కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ఆయన వేతనదారులకు తెలిపారు. ఈ కార్యక్ర మంలో గ్రామ మాజీ సర్పంచ్ లెంక పద్మావతి, మెయిల్ ఓవర్సీర్స్ ఈశ్వరరావు, సురేష్, స్థానిక బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ లీలాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.





# 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026' ఏపీకి లభించడం గర్వకారణం : మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ కార్యక్ర మానికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభిం చింది. ప్రతిష్ఠాత్మక 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026' పురస్కారం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంకు దక్కింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు మాట్లాడుతూ.. 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026' రాష్ట్రానికి లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు దార్శనికతతో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం విజయవంతంగా అమలవుతోందన్నారు. రైతులు, గ్రామీణ మహిళలు, వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్‌వైఎస్ఎస్ సంస్థ, శాస్త్రవేత్తల సమిష్టి కృషి ఫలితంగానే ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. ప్రపంచ స్థాయిలో లభించిన ఈ పురస్కారాన్ని రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు అంకితం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతమైన ఈ నమూనాను దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. సుస్థిర వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు రైతాంగ అభివృద్ధికి కొత్త అవకాశాలు తీసుకు రావడంతో పాటు ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహాన్ని అంది స్తుందని అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటు కేటాయించిన విజయ్ టీవీకే



**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం తమ కీలక భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌కు రాజ్యసభ స్థానం కేటాయించింది. తమిళనాడు నుంచి రాజ్యసభ స్థానానికి జూన్ 18న ఎన్నిక జరుగనుంది. కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటును కేటాయించిన విషయాన్ని ముఖ్యమంత్రి విజయ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 'ఈనెల 18న తమిళనాడులో రాజ్య సభకు ఎన్నిక జరుగనుంది. ఆ రాజ్యసభ సీటును మా భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌కు కేటాయించాలని టీవీకే నిర్ణయం తీసు కుంది' అని విజయ్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మైలం నియోజకవర్గం నుంచి ఎన్నికైన రాష్ట్ర మాజీ మంత్రి సీవీ షణ్ము గం తన రాజ్యసభ స్థానానికి మే 7న రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానానికి ఎన్నిక జరుగు తోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 8వ తేదీ వరకూ రిటర్నింగ్ అధికారి ముందు నామినేషన్లు దాఖలు చేసుకోవలసి ఉంటుంది. 9వ తేదీ ఉదయం 11 గంట లకు నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 11వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఒకరు కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే జూన్ 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 వరకూ సెక్రటేరియట్‌లో పోలింగ్ నిర్వహిస్తారు.

# పొరుగు రాష్ట్రాలతో గిల్లికజ్జాలు సరికాదు

## - మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్.. మీ వల్ల కాకపోతే చెప్పండి.. నేను, కిషన్‌రెడ్డి ఇప్పిస్తాం - రాజకీయ లబ్ధి కోసమే సీఎం రేవంత్ వ్యాఖ్యలు: బండి సంజయ్



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** "పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు కొనసాగించుకోవాలే తప్ప గిల్లికజ్జాలు పెట్టుకోవడం మంచి పద్ధతి కాదు. ప్రాజెక్టుల విషయంలో పొరుగు రాష్ట్రంతో సమస్య ఉంటే కూర్చుని చర్చించుకుని పరిష్కరించుకోవాలి. ప్రాజెక్టుల పేరుతో తెలంగాణ సెంటిమెంట్‌ను రగిల్చి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం సరికాదు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ప్రభు త్వం సహకరించిందన్న విషయాన్ని మరచిపోయారా? 6 గ్యారంటీలు, వడ్ల కొనుగోలు అంశంపై ప్రజల ను పక్కదారి పట్టించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే మహారాష్ట్ర సీఎం అపాయిట్‌మెంట్ ఇవ్వడంలేదని, ఉప్పెన సృష్టిస్తామని మాట్లాడుతున్నారు. సీఎం గారూ..! మీకు అపాయింట్‌మెంట్ తీసుకోవడం చేతగాకపోతే.. ఆ విషయాన్ని ఒప్పుకోండి. అప్పుడు నేను, కిషన్ రెడ్డి ముందుకొస్తాం. మహారాష్ట్ర సీఎం అపాయిట్‌మెంట్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తాం" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సంజయ్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్, కలెక్షన్, కమీషన్ అని విమర్శించారు. రాష్ట్రాన్ని సాధించుకున్నామే తప్ప తెలంగాణ ఆశయాలు, లక్ష్యాలను మాత్రం చేరుకోలేకపోయామన్నారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటంబం మా త్రమే బాగుపడిందని ఆరోపించారు. 1400 మందిని బలిని తీసుకుంటే తప్ప కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించింది బీజేపీయేనని చెప్పారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేదని, కేంద్రానికి పంపిన నివేదికల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వడ్లను కొంటోందని ఆయన తెలిపారు. హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలు చేయకుండా ఎవరు అడ్డుకుంటున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ బీజేపీతోనే సాధ్యమన్నారు. నిరుద్యోగ యువత తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉందని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు చేయడం చేతగాకుంటే మం త్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# టీఎంసీ రెబల్ ఎమ్మెల్యేల లేఖను స్వీకరించిన స్పీకర్.. నిర్ణయంపై ఉత్కంఠ





**కోల్‌కతా:** అంతర్గత విభేదాలతో సతమతమవుతున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో తుపాను రేగింది. తనకు 59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందంటూ సంతకాలతో కూడిన లేఖను పార్టీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీ స్పీకర్‌కు బుధవారం నాడు సమర్పించడం సంచలనమవుతోంది. రెబల్ వర్గం లేఖను స్వీకరించిన స్పీకర్ దీనిపై తన నిర్ణయాన్ని మధ్యాహ్నం 4 గంటలకు ప్రకటించనున్నట్టు తెలుస్తోంది. దీంతో టీఎంసీలో తిరుగుబాటు ఏ మలుపు తిరగనుందనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది. మరోవైపు, తిరుగుబాటు వర్గానికి సమాంతరంగా అసెంబ్లీలో తమ పార్టీ కీలక నియామకాలను టీఎంసీ సీనియర్ నేత కల్యాణ్ బెనర్జీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా స్పీకర్‌కు తెలియజేశారు. శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ను అసెంబ్లీలో విపక్ష నేతగా, ఆశిమా పాత్ర, నారాయణ్ బందోపాధ్యాయ్‌లను డిప్యూటీ నేతలుగా, ఫర్హాద్ హకీమ్‌ను చీఫ్ విప్‌గా నియమించామని అందులో పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే అభియోగంపై రితబ్రత బెనర్జీ, సందీపన్ సహాలను టీఎంసీ ఇటీవల బహిష్కరించింది. ఈ క్రమంలో రితబ్రత బెనర్జీ నాయకత్వంలో తిరుగుబాటు ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిసి ఎమ్మెల్యేల మద్దతు లేఖను అందించడం సంచలనమవుతోంది. ఈ పరిణా మంపై పార్టీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇంకా అధికారికంగా స్పందించలేదు.

**పార్టీ కమిటీలు, అనుబంధ సంస్థల రద్దు**

పార్టీలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ బుధవారంనాడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. బెంగాల్‌లో పార్టీ కమిటీలు, అనుబంధ సంస్థలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ప్రతి స్థాయిలోనూ సమగ్ర పరిశీలన, పనితీరు సమీక్ష, సంస్థాగత అంచనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది.

# వ్యక్తుల తప్పులను కులాలకు ఆపాదిస్తారా?.. వైసీపీ తీరుపై పవన్ కల్యాణ్ ధ్వజం



**అమరావతి, (రాజధాని వార్తలు):** భాష ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పిం చిన అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను కూడా నేడు కుల చట్రాల్లో బంధించడానికి సగటు రాజకీయ ఆలోచనలు చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలో అమరజీవి విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలన పక్కనబెడితే.. 1989 నుంచి రాజకీయాల్లో కుల దూషణలు విపరీతంగా పెరిగి పోయాయని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మరీ దిగజారిందని, సమాజానికి అద్దం పట్టే జర్నలి స్టులను సైతం కులాల పేరుతో దూషించడం ప్రారంభించారని ధ్వజమెత్తారు. ఒక వ్యక్తి తప్పు చేస్తే, దానికి కులాలను ఆపాదిస్తూ సమాజంలో చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ ఎమ్మెల్సీ దళిత యువకుడిని హత్య చేసి, శవాన్ని ప్యాక్ చేసి డోర్ డెలివరీ చేసినా ఆ పార్టీ వెనుకేసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి చంపేసినా ఆయా కుల సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కొంతమంది స్వార్థపరులు ఈ కుల సంఘాలను అడ్డం పెట్టుకుని వ్యక్తిగతంగా బాగుపడుతున్నారనే అనుమానం ఉందన్నారు. ఏ కులం నాయకుడితో ఆ కులం వారినే తిట్టించే నీచ సంస్కృతి వల్ల యువత భావోద్వేగాలకు లోనవుతున్నారని ఆందోళన చెందారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా వైసీపీ తీరు మారలేదని, ఇలాంటి కుల రాజకీయాలకు చరమగీతం పాడాలని జనసేన గట్టిగా నిర్ణయించుకుందని స్పష్టం చేశారు. ఇటీవల కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో దీనిపై చర్చించామని.. ఎవరు ఎలా మాట్లాడినా తామంతా కలిసి కట్టుగా స్పందిస్తామని పవన్ తెలిపారు. ఇకపై రాజకీయాల్లో జరిగే కుల దూషణలను, అరాచకాలను తిప్పికొట్టేందుకు జనసేన పక్షాన 'సేన గళం' పేరుతో ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు, ఇకపై ఎవరు దూషించినా 'సేన గళం' గట్టిగా స్పందిస్తుందని డిప్యూటీ సీఎం

# రాష్ట్రంలో మళ్లీ అధికారం కాంగ్రెస్‌దే

## - రేవంత్ నాయకత్వంలోనే ఎన్నికలకు...సోనియా వల్లే తెలంగాణ : మహేశ్‌గౌడ్



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే వచ్చే ఎన్నికలను ఎదుర్కొంటామని, రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో మంగళవారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. సోనియాగాంధీ దృఢ సంకల్పంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని చెప్పారు. తెలంగాణ ఏర్పాటు కోసం ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో బంగారు తెలంగాణ అంటూ మాట్లాడారని, కానీ ఆ మాటలు అన్నవారి కుటుంబం మాత్రమే బంగారం అయిందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, పేదవాడి అభ్యున్నతే ధ్యేయంగా ప్రజాపాలన కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. వేడుకల్లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు గీతారెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్, ఎంపీ అనిల్ యాదవ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు.. గాంధీభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ డాక్టర్స్ సెల్ కార్యవర్గ సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. తాను డాక్టర్ అవ్వాలనుకున్నానని, కానీ కొన్ని పరిస్థితుల వల్ల కాలేకపోయానని చెప్పారు. పార్టీ కోసం సమయం కేటాయిస్తున్న డాక్టర్లకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు.

**రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం**

రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేన్లు జారీ చేయనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

# రేపే నైరుతి రుతుపవనాల ఎంట్రీ.. ఏపీలో వానలు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నైరుతి రుతుపవనాలు రాబోయే 24 గంటల్లో కేరళంలోకి ప్రవేశించనున్నట్లు వాతావరణ శాఖ తెలి పింది. తద్వారా క్రమంగా దేశంలోని మిగతా ప్రాంతాల్లోకి రుతు పవనాలు విస్తరించనున్నాయి. గురువారంకి నైరుతి రుతు పవనాలు.. నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని ప్రాంతాలు, లక్షద్వీప్ దీవులు, కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్త రించే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మధ్య ప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఉత్తర తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఐదు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా కావలిలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే గడిచిన 24 గంటల్లో అత్యధికంగా విశాఖపట్నం జిల్లా భీమిలి ప్రాంతంలో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది.

# ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం అవసరం : సీఎం చంద్రబాబు



**గుంటూరు జిల్లా, (రాజధాని వార్తలు):** ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని తక్కెళ్లపాడులో సీఎం చంద్రబాబు పర్యటించారు. లలిత పివిఎస్ ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిం చారు. వేల కోట్లు, పదవులు ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభంలేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి.. ల్యాండ్‌మార్క్ ఇన్‌స్టిట్యూట్‌గా తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ హాస్పిటల్లోని ఎంఆర్ఐ స్కానర్ సౌత్ ఇండియాలోనే లేదని చెప్పుకొచ్చారు.

**పేదల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టాం..**

లలిత ఆస్పత్రి 600 పడకల సామర్థ్యంతో 900 మంది సిబ్బందితో ప్రారంభమైందని సీఎం చంద్రబాబు తెలిపారు. 32 విభాగాలకు వైద్యసేవలు అందించే ఏకైక కేంద్రం ఇదని వివరించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే.. ఏ వ్యవస్థ అయినా మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచి అలవాట్లతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని చెప్పారు. యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదని పేర్కొన్నారు.

**ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదు..**

మనిషికి ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నవారే నిజమైన ధనవంతులని చెప్పుకొచ్చారు. ఆరోగ్యవంతులైన పౌరులు ఆరోగ్యకరమైన దేశాన్ని తయారు చేస్తారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ బాగా పని చేస్తున్నారని ప్రశంసించారు. సబ్జెక్టు అర్థం చేసుకుని వైద్య ఆరోగ్య శాఖను చక్కగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సంజీవని పేరుతో డిజిటల్ హెల్త్ రికార్డు ప్రాజెక్టు తెస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ వైద్య పరిజ్ఞానం తెచ్చి ప్రజలకు ఇస్తామని అన్నారు. వ్యాధులు రాకుండా ఏం చేయాలో, వ్యాధి నిర్ధారణ నివారణకు సంబంధించి అత్యుత్తమ విధానాలు అమలు చేస్తామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తెచ్చి రెండున్నర లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు.

**ఆ బాధ్యత ప్రజలదే..**

పేదల ఆరోగ్యం కాపాడేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తామని.. కానీ అనారోగ్యానికి గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. తినే తిండి, మంచి అలవాట్లు, మన పరిసరాలు, మనం ఆలోచించే విధానం ఆరోగ్యానికి చాలా ముఖ్యమని వివరించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడేలా ఉండాలని అన్నారు. గతంలో పంటలను రసాయన ఎరువులు, పురుగు మందులు వేయ కుండా పండించామని ప్రస్తావించారు. జగన్ హయాంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయని అన్నారు. వైసీపీ హయాంలో దుర్మార్గమైన నిర్ణయంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. క్వాంటం, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్ రీసెర్చ్ వంటి విభిన్న సాంకేతిక రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇంట్లోనే ఉంటూ ఫోన్లు వాడితే ఎలా...? కుటుంబ సభ్యులు నేరుగా మాట్లాడుకోవాలని సూచించారు. పది నిమిషాలు వ్యాయామం చేయటానికి ఓపిక లేకపోతే ఎలా..? అందుకే అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**యోగా ద్వారా రికార్డులు సృష్టిద్దాం..**

ఈనెల 21వ తేదీన మరోసారి యోగా ద్వారా రికార్డులు సృష్టిద్దామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కృష్ణా నది బైపాస్ రహదారిపై యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కూడా సంప్రదాయ వైద్య విధానాలు ప్రమోట్ చేస్తున్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి గిన్నిస్ రికార్డులు వచ్చాయని ప్రస్తావించారు. మెడిటేషన్ యోగా కేంద్రాలు ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతన్నలు ప్రకృతి వ్యవసాయం చేయాలని సీఎం ఆకాంక్షించారు.

**హెల్తీ, వెల్దీ సమాజమే లక్ష్యం..**

ప్రస్తుతం 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని సీఎం చంద్రబాబు వివరించారు. రాబోయే రోజుల్లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తామని అన్నారు. 'ఆస్పత్రులు ఆలయాలని.. వైద్యులు దేవుళ్లు. వైద్యో నారాయణో హరి అనేది మన సంస్కృతిలో ఉంది. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలని తన కోరిక. హెల్తీ, వెల్దీ, హ్యాపీ సమాజమే మా

**RAJADHANI CLASSIFIEDS Ad. Call**
**9440662699, rajadhanivartalu.com**

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996


COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్లు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# పిఎమ్ స్వనిధి పథకం : వీధి వ్యాపారుల ఆర్థిక ప్రగతికి సరికొత్త బాట

భారతదేశంలో పట్టణీకరణ వేగంగా విస్తరిస్తోంది. 2050 నాటికి దేశ జనాభాలో దాదాపు 50% మంది పట్టణ ప్రాంతాల్లోనే నివసిస్తారని అంచనా. ప్రస్తుతం, పట్టణ శ్రామిక శక్తిలో సుమారు 66% మంది అసంఘటిత రంగంలోనే పని చేస్తుండగా, వీరంతా పట్టణ ఆర్థిక వ్యవస్థకు ముఖ్య స్తంభంగా నిలుస్తున్నారు. ఈ రంగంలో పనిచేస్తున్న వారిలో వీధి వ్యాపారులది కీలక పాత్ర. పండ్లు, కూరగాయలు, టీ, చిరుతిళ్లు, దుస్తులు, ఇతర రోజువారీ వినియోగ వస్తువులను విక్రయించే కోట్ల మంది వీధి వ్యాపారులు పౌరుల జీవితాలను సులభతరం చేయడమే కాదు, పట్టణ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన సహకారాన్ని అందిస్తున్నారు. వీధి వ్యాపారులకు ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, అధికారిక బ్యాంకింగ్, రుణ సదుపాయాలు చాలా పరిమితంగానే ఉండేవి. ఎలాంటి రుణ చరిత్ర లేకపోవడంతో అధిక వడ్డీ రేట్లకు అనధికారిక ఆర్థిక వనరులపై ఆధారపడాల్సిన పరిస్థితి, దీంతో వారి ఆదాయంలో చాలా వరకు రుణాల చెల్లింపులకే ఖర్చయ్యేది. 2020లో వచ్చిన కోవిడ్-19 మహమ్మారి.. వీధి వ్యాపారులకు మరిన్ని సవాళ్లు విసిరి, వారి వ్యాపారాలను తీవ్రంగా దెబ్బతీసింది. ఈ ఇబ్బందులకు పరిష్కారంగా జూన్ 2020లో ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకత్వంలో "ప్రధాన మంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి" (పిఎమ్ స్వనిధి) పథకాన్ని ప్రారంభించారు. భారతదేశంలో వీధి వ్యాపారుల కోసం ప్రవేశపెట్టిన మొట్టమొదటి సమగ్ర సూక్ష్మ-రుణ పథకమిది. ఇది వారికి మొదటిసారిగా అధికారిక ఆర్థిక రంగానికి సరళమైన, గౌరవప్రదమైన, సంస్థాగతమైన అవకాశాల్ని అందించింది. ఈ పథకం కింద, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఎలాంటి హామీ లేకుండానే రూ.15,000, రూ.25,000 మరియు రూ.50,000 వరకు మూడు విడతల్లో మూలధన రుణాలను అందిస్తాయి. సకాలంలో రుణాలను తిరిగి చెల్లింపును ప్రోత్సహిస్తూ, గడువులోగా రుణాలు చెల్లించే లబ్ధిదారులకు 7% వడ్డీ రాయితీని ఈ పథకం అందిస్తుంది. గత ఆరేళ్లలో, పిఎమ్ స్వనిధి పథకం.. దాదాపు 76 లక్షల మంది వీధి వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చింది, దాని మూడు రుణ పద్ధతుల్లో రూ.17,800 కోట్లకు పైగా రుణాల పంపిణీని సులభతరం చేసింది. మారుతున్న ప్రపంచ పరిస్థితులు, ఆర్థిక అస్థిరతల మధ్య భారతీయ వీధి వ్యాపారులు తమ స్థితిస్థాపకత, పట్టుదలకు పేరుగాంచారు. పిఎమ్ స్వనిధి వారి పారిశ్రామిక స్ఫూర్తిలోకి కొత్త శక్తిని నింపింది. ఈ పథకం కేవలం రుణాలు



అందించడానికే పరిమితం కాకుండా; గౌరవం, గుర్తింపు, కొత్త అవకాశాలకు ఒక శక్తివంతమైన సాధనంగా మారింది. ఈ పథకం విజయం సాధించడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థలు, బ్యాంకింగ్ సంస్థల సమన్వయ ప్రయత్నాలను ఒకచోటకి చేర్చిన ప్రభుత్వ సమగ్ర విధానం. ఈ సంయుక్త భాగస్వామ్యం దేశవ్యాప్తంగా అపూర్వమైన విస్తరణను, అద్భుతమైన ఫలితాలను సాధించడానికి సహాయపడింది. ఈ పథకం కింద, లక్షలాది వీధి వ్యాపారుల బ్యాంక్ ఖాతాలు వాడుకలోకి వచ్చాయి, ఆర్థిక లావాదేవీలు రికార్డు కావడం ప్రారంభమయ్యాయి. మొదటిసారిగా వారి కోసం ఒక అధికారిక రుణ చరిత్ర ఏర్పడింది. ఇది భవిష్యత్తులో పెద్ద మొత్తంలో రుణాలు, ఇతర ఆర్థిక సేవలను సులభంగా పొందడానికి మార్గం సుగమం చేసింది. ఈరోజు వీధి వ్యాపారులు గౌరవనీయ బ్యాంక్ వినియోగదారులుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. ఈ పథకంలోని మరో ముఖ్యాంశం డిజిటల్ సాధికారత. యూపీఐ, క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి క్యాష్‌బ్యాక్ ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టారు. ఈ చొరవ ద్వారా, 55 లక్షల కంటే ఎక్కువ మంది వ్యాపారులు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యారు. దీనివల్ల వారి లావాదేవీలు మరింత పారదర్శకంగా మారాయి, వారి ఆర్థిక విశ్వసనీయత బలపడింది. ఈ పథక దార్శనికత కేవలం వ్యాపార మద్దతుకే పరిమితం కాలేదు. "స్వనిధి సే సమృద్ధి" చొరవ ద్వారా, లబ్ధిదారులు, వారి కుటుంబాలను భారత ప్రభుత్వానికి చెందిన 8 ప్రధాన సంక్షేమ పథకాలతో అనుసంధానిస్తున్నారు. ఇప్పటివరకు 50 లక్షల కంటే ఎక్కువ మంది వీధి వ్యాపారుల కుటుంబాల ప్రొఫైలింగ్ పూర్తయింది, ఈ పథకాల కింద 1.52 కోట్లకు పైగా ప్రయోజనాలు మంజూరయ్యాయి. పెన్షన్లు, బీమా, ఆరోగ్య సంరక్షణ, సామాజిక భద్రత ప్రయోజనాలను కల్పించడం ద్వారా, ఈ చొరవ వీధి వ్యాపారులు, వారి కుటుంబాలకు సమగ్ర సామాజిక రక్షణ యంత్రాంగంగా అవతరించింది. అదనంగా, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో కుదుర్చుకున్న భాగస్వామ్యం.. ఆహార భద్రత, పరిశుభ్రతపై శిక్షణ అందించడానికి వీలు కల్పించింది. నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రత పద్ధతులు, వినియోగదారుల నమ్మకాన్ని పెంపొందించడం ద్వారా ముఖ్యంగా వీధి ఆహార వ్యాపారులకు ఎంతో మేలు చేసింది. మహిళా సాధికారతకు కూడా ఈ పథకం గణనీయమైన సహకారాన్ని అందించింది. మొత్తం లబ్ధిదారులలో మహిళలు దాదాపు 46% మంది ఉన్నారు. ఫలితంగా, వారి ఆదాయ స్థాయిలు, సామాజిక హోదా, గృహ నిర్ణయాలలో భాగస్వామ్యం గణనీయంగా మెరుగుపడ్డాయి. 2023, 2025 లలో నిర్వహించిన స్వతంత్ర ప్రభావ అంచనాలు ఈ పథకం అందించే దీర్ఘకాలిక ప్రభావాన్ని గుర్తించాయి. దాదాపు 95% మంది లబ్ధిదారులు తమ జీవితంలో మొదటిసారిగా బ్యాంక్ రుణాన్ని పొందారు. ఇది ఆర్థిక సమగ్రతలో ఒక చారిత్రాత్మక విజయంగా నిలిచింది. అంతేకాకుండా, దాదాపు 30% మంది లబ్ధిదారులు తదనంతరం ఇతర అధికారిక ఆర్థిక సంస్థల నుండి రుణాలు పొందారు. ఇది వారి పెరుగుతున్న ఆర్థిక విశ్వాసాన్ని, బలమైన రుణ చరిత్రను ప్రతిబింబిస్తోంది. లబ్ధిదారులు తమ వార్షిక ఆదాయంలో సగటున దాదాపు 20% పెరుగుదలను నమోదు చేశారు. గృహ వసతి పరిస్థితులు, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ సౌలభ్యం, పిల్లల విద్యలో కూడా మెరుగుదలలు కనిపించాయి. 2023, 2025 మధ్య లబ్ధిదారులలో యూపీఐ ఆధారిత లావాదేవీల వినియోగం సుమారు 45% నుండి 83%కి గణనీయంగా పెరిగింది. ఈ పథకం విస్తృత, సానుకూల ప్రభావాన్ని గుర్తిస్తూ, కేంద్ర మంత్రి మండలి, ఆగస్టు 2025లో, దీనిని పునర్వ్యవస్థీకరించిన రూపంలో మార్చి 2030 వరకు పొడిగించడానికి ఆమోదం తెలిపింది. ఈ సరికొత్త పథకం కింద, వీధి వ్యాపారుల రుణ పరిమితులను పెంచారు. దీని పరిధిని పట్టణ స్థానిక సంస్థలకే పరిమితం చేయకుండా జనగణన పట్టణాలు, పరిధి దాటిన పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరించారు. వ్యాపారులు తమ సంస్థలను మారుతున్న ఆర్థిక అవసరాలకు అనుగుణంగా బలోపేతం చేసుకోవడానికి, మార్చుకోవడానికి వీలుగా సామర్థ్య పెంపొందించుకోవడానికి కూడా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ దిశగా, "స్వనిధి క్రెడిట్ కార్డ్"ను ప్రవేశపెట్టడం మరొక ముఖ్యమైన అడుగు. ఈ కార్డ్ వ్యాపారులకు తక్షణ ఆర్థిక, వ్యక్తిగత అవసరాలను తీర్చుకోవడానికి స్వల్పకాలిక, వడ్డీ లేని రుణ సౌకర్యాన్ని అందిస్తుంది. పిఎమ్ స్వనిధి వీధి వ్యాపారుల ఆర్థిక సాధికారతను గణనీయంగా ముందుకు తీసుకెళ్లినప్పటికీ, వారిలో చాలా మందిని పట్టణ ప్రణాళికా చట్రంలో ఇప్పటికీ అంతర్భాగంగా గుర్తించడం లేదు. అలాగే.. వారికంటూ ప్రత్యేకంగా వ్యాపార స్థలాలు లేకపోవడం వంటి సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు. క్రమబద్ధీకరించిన అమ్మకపు మండలాలు లేకపోవడం వారి జీవనోపాధి, వినియోగదారుల సౌలభ్యం రెండింటినీ ప్రభావితం చేస్తుంది. ఈ సవాలును పరిష్కరించడానికి, రాబోయే సంవత్సరాల్లో వీధి వ్యాపారులను పట్టణ ప్రణాళికాల్లో చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థలు కృషి చేయాలి. ఈ విషయంలో ఒక మంచి చొరవ "స్ట్రీట్ ఫుడ్ హబ్స్" అభివృద్ధి, ఇది వ్యాపారులకు వ్యవస్థీకృత, సులభంగా చేరుకోగల వ్యాపార స్థలాలను అందిస్తుంది. ఇటువంటి ప్రయత్నాలు వారి జీవనోపాధిని బలోపేతం చేయడమే కాకుండా స్వచ్ఛమైన, మరింత వ్యవస్థీకృత, మరింత శక్తివంతమైన పట్టణ వాతావరణానికి దోహదం చేస్తాయి. పిఎమ్ స్వనిధి పథకం క్షేత్రస్థాయిలో 'ఆత్మనిర్భర్ భారత్', 'వోకల్ ఫర్ లోకల్' దార్శనికతను ప్రతిబింబిస్తుంది. దీని విజయం సమ్మిళిత అభివృద్ధి ఫలాలు సమాజంలోని అత్యంత బలహీన వర్గాలకు చేరుతున్నాయని నిరూపిస్తుంది. ఈ పథకం వీధి వ్యాపారుల కోసం ఆర్థిక సమగ్రత, సామాజిక భద్రత ప్రభావవంతమైన నమూనాను స్థాపించింది. రాబోయే సంవత్సరాల్లో, పిఎమ్ స్వనిధి మిలియన్ల కొద్దీ వ్యాపారులకు సాధికారతను కల్పిస్తూనే ఉంటుందని, పరివర్తనకు సంబంధించిన కొత్త కథనాలను సృష్టిస్తుందని, 'వికసిత్ భారత్' నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

**శ్రీ మనోహర్ లాల్**

(రచయిత కేంద్ర గృహనిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి)

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan